జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 04 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 208

RNI No : TELTEL/2008/24799 | వెల: రూ.3 | పేజీలు: 12

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL

http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



SURABHI DAYAKAR RAO COLLEGE OF PHARMACY
Rimmanaguda, Gajwel-Siddipet-502312
Approved by PCI, New Delhi, Affiliated to JNTU Hyderabad
(Sponsored by Surabhi Educational Society, Regd: 3819, Estd:1990)

B.PHARMACY SPOT/CAT-B STUDENTS ADMISSION NOTIFICATION FOR A.Y 2026-27

Interested candidates can attend spot admissions with original certificates and prescribed fee on or before 05/10/2026 for SPOT and 16/10/2026 for Cat-B(30%) in the college premises. Admissions will be made as per guidelines given by the Convener, TGEAPCET 2026.

Contact Nos: 8179054347, 9246918821 www.sdrcpedu.org




## నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది

### స్మిత్ మచ్చర్ పై దుబాయ్ యువరాజు ప్రశంసలు

### మచ్చర్‌ను పరామర్శించిన దుబాయ్ యువరాజు

న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): పైదుబాయ్ విమాన ఘటనలో కో పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడినా తన ప్రాణాలను ఏమాత్రం లెక్కచేయకుండా మిగతా 2లో..

### ఆసియా క్రీడల్లో

## భారత్ జోరు

- 21 స్వర్ణాలు సహా 85 పతకాలు
- 4వ స్థానంలో నిలిచిన భారత్
- చివరిరోజూ భారత్ పథకాల పంట
- హాకీలోనూ 'డబుల్ గోల్డ్' కైవశం
- పురుషుల స్వర్ణం కూడా కైవసం
- ఫైనల్‌లో మలేషియాపై విజయం
- ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు




న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, మిగతా 2లో..

### సర్ పరిశీలనకు

## స్వతంత్ర కమిటీ

- సుప్రీం, హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో ఏర్పాటు
- ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు
- దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణకు నిర్ణయం




న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): ఎన్నికల కమిషన్(ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమౌతున్న తరుణంలో మరో కీలక పరిణామం జరిగింది. ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక కమిటీని లాయర్స్ అసోసియేషన్ ఫర్ కాన్స్టిట్యూషన్ (ఎల్ఏఎఫ్‌సీ) ఏర్పాటు చేసింది. ఇందులో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మిగతా 2లో..

### సర్ నోటీసుల గందరగోళంపై ఈసి సమీక్ష

#### ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): తెలంగాణ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా లక్షలాది మంది ఓటర్లకు ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా నోటీసులు మిగతా 2లో..




ఎల్‌నినో రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తీవ్రమైన వేడి, ఉక్కపోత కారణంగా వివిధ రాష్ట్రాల్లో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరడంతో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) విద్యుత్‌ను కొనుగోలు చేద్దామన్నా దొరక్కపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వర్షాకాలంలో కూడా వానలు లేకపోవడం, జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గిపోవడం వల్ల కరెంట్‌కు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. సాధారణంగా ఏటా 6 నుంచి 7 శాతం వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకొని నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తారు. అయితే ఈ ఏడాది డిమాండ్ ఒక్కసారిగా 23 శాతం నుంచి 88 శాతం వరకు పెరగడంతో డిస్కంలు అల్లాడుతున్నాయి.

# కరెంటుపై ఎల్‌నినో ఎఫెక్ట్!

## రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం

- రికార్డు స్థాయిలో వినియోగం
- విద్యుత్‌కు అనూహ్య డిమాండ్
- కొందామన్నా దొరకని పరిస్థితి
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేనా!
- వచ్చే రబీలో గడ్డు పరిస్థితి!!

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): సాధారణంగా వర్షాకాలంలో తెలంగాణ రోజువారీ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 12 వేల నుంచి 15 వేల మెగావాట్లలోపే నమోదవుతుంది. కానీ ఈ ఏడాది వానలు లేకపోవడంతో పంటల సాగు కోసం 20 లక్షల వ్యవసాయ బోర్లపై ఆధారపడటం, గృహావసరాలకు ఏసీల వాడకం విపరీతంగా పెరగడం, పరిశ్రమల అవసరాలు తోడై డిమాండ్ ఆకాశాన్నంటుతోంది. ఎత్తిపోతల పథకాల మోటార్ల వాడకమే నిరుడు రోజుకు 450 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం ఏకంగా 1,800 మెగావాట్లకు చేరింది. దీని ఫలితంగా సెప్టెంబరు 30న చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది సెప్టెంబరు 30న నమోదైన 10,520 మెగావాట్లతో పోలిస్తే ఇది ఏకంగా 89% అధికం. సాధారణంగా మిగతా 2లో..




### మహిళలు, పిల్లల రక్షణకు

## ప్రభుత్వం ప్రాధాన్యత

- సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి
- భరోసా కేంద్రాల్లో ఒకేచోట పోలీసు సహాయం
- న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నాం
- దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు ఏర్పాటు
- పిల్లల సైబర్ భద్రతకు సమగ్ర ఫ్రేమ్‌వర్క్..
- దక్షిణాది ప్రాంతీయ సదస్సులో సిఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలకు అవసరమైన భద్రత, సంరక్షణ అందించేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై చిన్నారుల రక్షణకు సంబంధించి న్యాయ సేవల సంస్థలు రూపొందిస్తున్న కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో మిగతా 12లో..

### ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

- ఆస్పత్రులలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి
- సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలి
- అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి
- ప్రతివారం పురోగతిపై సమీక్ష నిర్వహించాలి
- విద్య, వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- సౌకర్యాల కల్పనపై అధికారులకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం మిగతా 12లో..

## ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

- 18వరకు అత్యంత వైభవంగా నిర్వహణ
- రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ సంజయ్ జాజు వెల్లడి
- బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మిగతా 2లో..

### 22-ఏ సమస్యల పరిష్కారంలో

## మరో కీలక అడుగు

- నాలా రుసుము చెల్లింపుతో భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- శరవేగంగా ముఖ్యమంత్రి హామీల అమలు, ఉత్తర్వులు జారీ
- 22ఎ సమస్యల పరిష్కారంపై నిరంతరం మానిటరింగ్ చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వ్యవసాయ భూములుగా ఉన్న పట్టా భూములు, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం నాడు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నెంబర్ 48062/ఖూజ/ూ1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22 ఎ, లో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాలా రుసుము మిగతా 12లో..





### కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం..
- మెట్రో--ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- మెట్రో, ఆర్టీసీలో ప్రయాణించిన భట్టి, పొన్నం
- బస్సులోనూ ప్రయాణికులతో భట్టి ముచ్చట
- ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ మిగతా 12లో..

### వాహనదారులకు భారీ షాక్

#### పెట్రోల్‌పై రూ.5 పెంచిన నయారా ఎనర్జీ

#### డీజిల్‌పై లీటరుకు రూ.3 పెరుగుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ప్రజాజ్యోతి): వాహనదారులకు నయారా ఎనర్జీ షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచింది. పెట్రోల్‌పై లీటరుకు రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా నయారా ఎనర్జీకి ఉన్న మిగతా 2లో..

# సంపాదకీయం

## సామాన్యులపై ధరల మోత!?

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఈసారి భారత్‌లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. కానీ ఆశించినంతంగా వర్షాలు కురవలేదు. ఈ లోటు వర్షపాతంతో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం సజావుగా సాగక వ్యవసాయాధారిత సరుకులపై తీవ్ర ప్రభావం చెపే ప్రమాదం లేకపోలేదు. తద్వారా సామాన్యులపై ధరల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆహార సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనబడుతున్నాయి. ఈ మధ్య న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి. ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్‌అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఏది ఏమైనా ఈసారి ఎల్‌నినో సృష్టించిన ఈ పెను విపత్తును ముందుగా గ్రహించి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ గండం నుండి గట్టెక్కే పరిస్థితులు లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వాహనదారులకు భారీ షాక్

మొదటిపేజీ తరువాయి..

7,000కు పైగా పెట్రోల్ బంకుల్లో కొత్త ధరలు అమలవుతున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు, ఇంధన ధరలు పెరగడంతో కొనుగోలు వ్యయం పెరిగిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచడం ఇది రెండోసారి. మార్చిలోనూ పెట్రోల్, డీజిల్‌పై ఇదే స్థాయిలో ధరలు పెంచింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అప్పట్లో ధరలు పెంచింది. ముడిచమురు ధరలు తగ్గడంతో జులైలో ఆ పెంపును వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను మార్చలేదు. దేశంలో 1.04 లక్షలకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలోనే ఉన్నాయి. ఇటీవల ప్రైవేటు ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ అమ్మకాలను తగ్గించకూడదని కేంద్రం సూచించింది. ఇదిలా ఉంటే వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అక్టోబర్‌లో రూ.62.50 మేర పెంచాయి. 19 కిలోల సిలిండర్ ధర పెరిగింది. అయితే గృహ వినియోగ ఎల్పీజీ ధరను రూ.942 వద్దే కొనసాగిస్తున్నాయి. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర కూడా పెరిగింది. లీటరుకు రూ.16 చొప్పున పెంచడంతో దేశీయ విమాన సంస్థలకు లీటర్ ఏటీఎఫ్ ధర రూ.121 నుంచి రూ.137కు చేరింది.

## సర్ నోటీసుల గందరగోళంపై ఈసి సమీక్ష

మొదటిపేజీ తరువాయి..

జారీ కావడం కలకలం రేపింది. ఈ గందరగోళంపై స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం, బల్క్ డిలీషన్లకు చెక్ పెడుతూ ముందస్తు నోటీసులు, విచారణ తప్పనిసరి చేసింది. అంతేకాకుండా, సవరణ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన వారు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే, అత్యంత విస్తుపోయే విషయమేమిటంటే.. ఆ నోటీసుల్లో అసలు ఏ కారణం చేత నోటీసు ఇచ్చారో పేర్కొనకపోవడం తీవ్ర అయోమయానికి దారితీసింది. కారణం కాలమ్ ఖాళీగా ఉండటంతో ఏ పత్రాలు సమర్పించాలో తెలియక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వేలాది ఓట్లను ఒకేసారి తొలగించేవారనే ఆరోపణలు ఉండటంతో, ఇకపై ఒకేసారి భారీగా ఓట్లను డిలీట్ చేయడాన్ని నిరోధించేందుకు ఠిన చర్యలు చేపట్టింది.

# కరెంటుపై ఎల్‌నినో ఎఫెక్ట్!

మొదటిపేజీ తరువాయి..

ఏటా 6 నుంచి 7 శాతం మేర వృద్ధిరేటు అంచనాతో సరఫరా ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే రోజువారీ డిమాండ్ ఏకంగా 23% నుంచి 38% వరకు అనూహ్యంగా పెరగడంతో డిస్కంలు తలకిందులవుతున్నాయి. లోటును పూడ్చుకునేందుకు భారత ఇంధన ఎక్స్ఛేంజీ (×జుశ) ద్వారా యూనిట్‌కు గరిష్ఠ ధర అయిన రూ. 10 చెల్లించేందుకు రాష్ట్ర డిస్కంలు సిద్ధపడినా సరిపడా విద్యుత్ లభించడం లేదు. ఉదాహరణకు అక్టోబరు 1న సాయంత్రం 4 గంటల సమయంలో 2,036 మెగావాట్ల విద్యుత్ కావాలని యూనిట్‌కు రూ. 10 చొప్పున కోరగా, కేవలం 328 మెగావాట్లు మాత్రమే లభించడం తీవ్ర కొరతకు అద్దం పడుతోంది. రాష్ట్రంలో సెప్టెంబరు 28న వినియోగించిన 8.8 కోట్ల యూనిట్లలో జెన్‌కో సొంత ప్లాంట్ల నుంచి సమకూరింది 9.5 కోట్ల యూనిట్లే. మిగతా విద్యుత్‌ను అధిక ధరలకు బయట మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సి వచ్చింది. పగటివేళ సౌర విద్యుత్ ద్వారా 6 కోట్ల యూనిట్లు లభిస్తున్నప్పటికీ, సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సౌరశక్తి లేకపోవడంతో రాత్రి వేళల్లో విద్యుత్ సమకూర్చుకోవడం పెను సవాలుగా మారింది. రిజర్వాయర్లలో నీరు లేక జలవిద్యుదుత్పత్తి దాదాపు నిలిచిపోవడం సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. మరోవైపు థర్మల్ విద్యుత్ కేంద్రాలు బొగ్గు కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశవ్యాప్తంగా 180 థర్మల్ ప్లాంట్లలో ఉండాల్సిన 6.03 కోట్ల టన్నుల బొగ్గు నిల్వల్లో ప్రస్తుతం 31% మాత్రమే ఉంది. తెలంగాణ విషయానికొస్తే, రాష్ట్ర థర్మల్ ప్లాంట్లలో కనీస నిల్వలు 20.83 లక్షల టన్నులు ఉండాల్సి ఉండగా, కేవలం 5.57 లక్షల టన్నులు (27%) మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సింగరేణి గనుల్లో జీ-11 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి సరిపడా లేకపోవడంతో కొత్తగూడెం (800 మెగావాట్లు), భద్రాద్రి (1,080 మెగావాట్లు), యాదాద్రి (3,200 మెగావాట్లు) ప్లాంట్లలో పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి సాధ్యం కావడం లేదు. వచ్చే నెలల్లో చలికాలం ప్రారంభమైతే ఏసీల వాడకం, ఖరీఫ్ సాగు తగ్గి డిమాండ్ కొంత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, జనవరి నుంచి మొదలయ్యే రబీ సీజన్‌లో వ్యవసాయ బోర్ల వాడకం మళ్లీ గరిష్ఠ స్థాయికి చేరుతుంది. అప్పటికల్లా థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలను సమకూర్చుకోకపోతే ఫిబ్రవరి, మార్చి నెలల్లో తీవ్ర విద్యుత్ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ డిస్కంలు సరైన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. రాత్రి సమయాల్లో సరఫరా నిరాటంకంగా సాగేందుకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిర్మాణంపై వేగంగా దృష్టి సారించాలి. రాబోయే రబీలో విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు రైతులు ఆరుతడి పంటలు వేసేలా వ్యవసాయ శాఖ చైతన్యపరచాలని, కోల్ ఇండియాతో నాణ్యమైన బొగ్గు సరఫరాకు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అన్ని రాష్ట్రాల డిస్కంలు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లో యూనిట్‌కు రూ.10 చొప్పున చెల్లించి విద్యుత్‌ను కొనుగోలు చేయడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం అక్కడ కూడా కరెంట్ లభ్యం కావడం లేదు. ఈ నెల 1న సాయంత్రం 4 గంటల వేళలో తెలంగాణ డిస్కంలు యూనిట్‌కు రూ.10 చొప్పున 9,636 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని ఐఈఎక్స్‌ను కోరగా, కేవలం 428 మెగావాట్లు మాత్రమే దొరికింది. పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో రాష్ట్రంలో చేస్తున్న విద్యుత్ ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తుంది. కానీ అది ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు సెప్టెంబర్ 28న రాష్ట్రంలో 33 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించాం. ఇందులో జెన్‌కో సొంత ప్లాంట్ల నుంచి కేవలం 8.5 కోట్ల యూనిట్లు మాత్రమే వచ్చింది. మిగిలిన విద్యుత్ మొత్తం బయటి నుంచి సేకరించిందే. పగటిపూట సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా రాష్ట్రానికి 6 కోట్ల యూనిట్ల విద్యుత్ లభిస్తుంది. అయితే సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు సౌర విద్యుత్ అందుబాటులో ఉండదు. దీంతో ఈ సమయంలో కరెంట్ సరఫరా చేయడానికి ఎక్స్ఛేంజ్ నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. రికార్డు స్థాయిలో డిమాండ్ నెలకొంటున్నా మన డిస్కంలు ప్రస్తుతం సాధ్యమైనంత వరకు కరెంటును సరఫరా చేస్తున్నాయి. వచ్చే నెల నుంచి చలికాలం ప్రారంభమైతే ఏసీలతో పాటు పంటల సాగుకు కూడా విద్యుత్ వినియోగం తగ్గుతుందని అంచనా. అయితే రబీ పంటల సాగు కాలం ప్రారంభమయ్యే జనవరి నుంచి వ్యవసాయ బోర్లకు కరెంటు అవసరం కానుండటంతో మళ్లీ రికార్డు స్థాయిలో వినియోగం పెరుగుతుంది. దీన్ని పరిష్కరించాలంటే ఆరు తడి పంటలను పండించేలా రైతులను చైతన్యపరచాలి. అదే సమయంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని మెరుగుపరచేందుకు యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరాను పెంచాలి. లేదంటే విద్యుత్ కొరత ఏర్పడి ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిరంతర సరఫరాపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆరు నెలల నుంచే వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. వర్షాలు లేక జలవిద్యుత్ ఉత్పత్తి ఉండదని, ఖరీఫ్ పంటల కోసం రైతులు వ్యవసాయ బోర్లపైనే ఎక్కువగా ఆధారపడతారనీ తెలిసిన విషయమే. అయినా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌పై కనీస అంచనాలు వేయకపోవడం, అదనపు విద్యుత్ కొనుగోలుకు ఒప్పందాలు చేయకపోవడం, బొగ్గు నిల్వలను పెంచుకోవడానికి చర్యలు తీసుకోకపోవడానికి విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమని సీనియర్ విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందాలు చేసుకోవాలని, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిర్మాణంపై కూడా దృష్టి పెట్టాలని విద్యుత్ రంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యుత్ డిమాండ్ అంచనాలు సరిగా లేవంటూ నిరుడు కేంద్ర విద్యుత్ మండలి అసంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి అనుగుణంగా విద్యుత్ వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతాయో కచ్చితంగా అంచనా వేయడానికి డిస్కంలు నిపుణులతో అధ్యయనాలు చేయించాలని తెలిపారు. డిమాండ్‌ను తీర్చడానికి సౌర విద్యుత్ అందుబాటులో లేని రాత్రి వేళల్లో నిరంతర సరఫరాకు డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా బ్యాటరీ నిల్వ సామర్థ్యం, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచడం అత్యవసరమని చెబుతున్నారు.

ఆసియా క్రీడల్లో

# భారత్ జోరు

మొదటిపేజీ తరువాయి..

బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు



మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది. ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది. భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గొహెయిన్, పర్వీన్ హుడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు. గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. స్వర్ణాల సంఖ్య కూడా 28 నుంచి 21కి పడిపోయింది. ముఖ్యంగా షూటింగ్‌లో ఏడు స్వర్ణాల నుంచి మూడింటికి తగ్గాయి. అథ్లెటిక్స్‌లో గతంలో ఆరు స్వర్ణాలు సాధించగా.. ఈసారి ఒక్క పసిడి మాత్రమే దక్కింది. రోయింగ్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలు తగ్గాయి. టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో ఈసారి ఒక్క పతకం కూడా రాలేదు. పతకాల సంఖ్య తగ్గినా.. ఈసారి పలువురు భారత క్రీడాకారులు వ్యక్తిగతంగా చరిత్ర సృష్టించారు. మహిళల హాకీ జట్టు నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణాన్ని అందుకుంది. ఆర్చరీ, గోల్ఫ్, షూటింగ్, రెజ్లింగ్‌లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. మొత్తంగా 20 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన భారత్.. చివరి వరకు పోరాడి టాప్-5లో నిలిచింది. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సాధించిన అపూర్వ విజయాలు ఈ ఆసియా క్రీడలను భారత క్రీడాభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేశాయి. కాగా.. ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు. ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.

ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

## ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

మొదటిపేజీ తరువాయి..

18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జీహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్జీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండిలి అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది

మొదటిపేజీ తరువాయి..

విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక స్మిత్ నుదిటిపై ఆప్యాయంగా ముద్దు పెట్టారు. ఇక స్మిత్ ధైర్య సాహసాలను పొగుడుతూ ఆస్పత్రిలో తనను పరామర్శించిన వివరాలను దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. దుబాయ్ పరిపాలన యంత్రాంగం మొత్తం స్మిత్ ను అభినందిస్తుంది.. ప్రశంసలు కురిపిస్తుంది అని పేర్కొన్నారు. ఈ మేరకు భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలను కొనియాడారు. అతని ధైర్యం, బాధ్యత, మానవులపై ఆప్యాయత మరువలేనిదని ప్రశంసించారు దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్. అతను తమ టీమ్ లో ఉన్నందుకు తమకు గర్వంగా ఉందని వివరించారు. " ఇతను మా టీమ్ లో భాగస్వామిగా ఉన్నందుకు మాకు గర్వంగా ఉంది. మన దేశం స్టోరీలో అతను భాగమయ్యాడు. యూఏఈ ఏ నేషన్ ఆఫ్ కంపాషన్.. ఏ నేషన్ ఆఫ్ పీస్.. అండ్ ఏ నేషన్ ఆఫ్ లైఫ్ అని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పోస్టు చేశారు. దుబాయ్ యువరాజు పోస్టు చేసిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. మరోవైపు భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్యం మెరుగవుతోందని యూఏఈలోని భారత కార్యాలయం పేర్కొంది. ప్రస్తుతం స్మిత్ ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని.. ఆయన కుటుంబసభ్యులు, స్థానిక అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. ఇక ఇటీవల ప్రపంచాన్ని షాక్ చేసిన ఫ్లైదుబాయ్ ఘటనలో ఒమన్ కు చెందిన కోపైలట్ హమామ్ అల్బామామి దాడిలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ మేరకు విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన హమామ్ అల్బామామిని వీరోచితంగా అడ్డుకుని పోరాడారు. అనంతరం కాక్ పిట్ తలుపు తెరవడంతో విమానంలోని ప్రయాణికులు లోపలికి వెళ్లి కో పైలట్ ను అదుపులోకి తీసుకున్నారు. దాంతో ఈ ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.

మరోవైపు భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు భారీ గుర్తింపు లభించింది. ఆయన ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ మాన్‌కైండ్ ఫార్మా రూ.కోటి నగదు బహుమతిని ప్రకటించింది. ఈ మొత్తాన్ని కెప్టెన్ మచ్చార్‌తో పాటు ఆయన కుటుంబానికి అందించనున్నట్లు సంస్థ తెలిపింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సౌదీ, ఇజ్రాయెల్ అధికారుల ప్రకారం.. కో-పైలట్ కెప్టెన్ మచ్చార్‌పై దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమయంలో విమానం భారీగా కిందికి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో ఉన్నప్పటికీ మచ్చార్ కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయానికి సురక్షితంగా మళ్లించారు. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నట్లు ఫ్లైదుబాయ్ అధికారికంగా వెల్లడించింది. ఈ ఘటనపై పూర్తి అధికారిక దర్యాప్తు కొనసాగుతోంది. ఘటన వెనుక కారణాలు, ఉద్దేశాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఫ్లైదుబాయ్ స్పష్టం చేసింది. కాగా, కెప్టెన్ మచ్చార్ ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ కూడా ఆయనకు ప్రత్యేక శౌర్య పురస్కారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు, మచ్చార్ ధైర్యాన్ని ప్రశంసిస్తూ మాన్‌కైండ్ ఫార్మా.. "తన కంటే సిబ్బంది, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారు" అంటూ రూ.కోటి బహుమతిని ప్రకటించింది.

సర్ పరిశీలనకు

# స్వతంత్ర కమిటీ

మొదటిపేజీ తరువాయి..

జస్టిస్ మదన్ బి. లోకూర్ నేతృత్వం వహించనున్నారు. సర్ ప్రక్రియ రాజ్యాంగానికి, సంబంధిత చట్టాలకు అనుగుణంగా ఉందా అనే అంశాన్నిఈ కమిషన్ పరిశీలించనుంది. అంతేకాదు ఓటర్ల జాబితా సవరణకు అనుసరించిన విధానం ఎలా ఉంది? దాని వల్ల అర్హులైన ఓటర్లపై ఎలాంటి ప్రభావం పడింది? అనే అంశాలను పరిశీలించనుంది. ముఖ్యంగా అర్హత ఉన్న పౌరుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాయా లేదా, అర్హత లేని పేర్లను సరైన విధానంలో తొలగించారా అనే విషయాలను పరిశీలించనుంది. ఎస్ఐఆర్ అమలు చేసిన విధానం, దాని చట్టపరమైన ఆధారం, అర్హులైన ఓటర్లపై పడిన ప్రభావం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ప్రభావితమైన పౌరులు, పౌర సమాజ సంస్థలు, నిపుణుల అభిప్రాయాలు, వాంగ్మూలాలను సేకరించనుంది. కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్, చందర్ ఉదయ్ సింగ్, ప్రశాంతో చంద్ర సేన్, రాజు రామచంద్రన్, రెబెక్కా మామెన్ జాన్, వారిషా ఫరాసత్, గ్రోవర్ వంటి ప్రముఖ న్యాయ నిపుణులు ఈ కమిషన్‌కు వ్యూహాత్మక న్యాయ సలహాలు అందించనున్నారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్న తరుణంలో ఎన్నికల సంఘం శుక్రవారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్ఐఆర్ పూర్తైన ప్రాంతాల్లో తొలగించిన అర్హులైన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియతో పెద్దఎత్తున ఓట్లు గల్లంతయ్యాయంటూ ఆందోళనలు, అటు విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న వేళ ఈసీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అలాగే, 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నట్లు తెలిసింది.

# పత్తి చేనులో గంజాయి సాగు... ఒకరి అరెస్ట్

- రూ.5.10 లక్షల విలువైన 51 మొక్కలు స్వాధీనం..



**నేరడిగొండ, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** పత్తి పంట మధ్యలో అంతర పంటగా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఓ రైతును నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న 51 గంజాయి మొక్కలను వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5.10 లక్షలు ఉంటుందని ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం అరేపల్లి గ్రామ శివారులోని ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమిలో పత్తి పంట మధ్యలో రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులను చూసి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన స్థానిక రైతు సిడాం గంగారాం వయస్సు (60), తండ్రి జైతును అదుపులోకి తీసుకుని విచారించారు.

విచారణలో తన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమిలోని పత్తి పంట మధ్యలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గంగారాం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పత్తి చేనులో 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 51 గంజాయి మొక్కలను గుర్తించి వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో మొక్క విలువ సుమారు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.5.10 లక్షలు ఉంటుందని సీఐ రమేష్ పేర్కొన్నారు. గంజాయి మొక్కలను సీజ్ చేసి, నిందితుడిపై నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**అక్రమ సాగుపై కఠిన చర్యలు :** జిల్లాలో గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు అందకుండా సిఫార్సు చేస్తామని తెలిపారు. గంజాయి సాగు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు జిల్లా ఎస్పీ వాట్సాప్ నంబర్ 8712659973కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

# ఓటు హక్కు రక్షణకు ఉద్యమం

- ఈసీ చీఫ్ రాజీనామా చేయాలి: ఆత్రం సుగుణక్క
- ఓటు చోరీపై పోరు ఉధృతం
- సేవ్ డెమోక్రసీ వీక్‌లో ఇండియా కూటమి కార్యాచరణ
- ఓటు హక్కుతో చెలగాటం సహించం
- ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి.. సుగుణక్క డిమాండ్
- ఎన్నికల జాబితాపై ఇంటింటా అవగాహన
- తదుపరి కార్యాచరణకు ఇండియా కూటమి సమావేశం



**ఆసిఫాబాద్, అక్టోబరు 3 ప్రజా జ్యోతి :** ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్, ఇండియా కూటమి మరో ఉద్యమానికి సిద్ధమైంది. 'సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో మార్పులు, ఎన్నికల సంఘం జవాబుదారీతనంపై చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై శనివారం ఆసిఫాబాద్‌లోని డీసీసీ కార్యాలయంలో కూటమి నేతలు సమావేశమయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

అక్టోబరు 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న 'సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమన్నారు. ప్రతి ఓటు విలువను కాపాడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలతోపాటు ప్రజలపైనా ఉందన్నారు.

బీజేపీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓటు చోరీకి పాల్పడుతోందని, ఓటర్ల జాబితాలో అక్రమాలు, అనుమానాస్పద మార్పులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో చేపడుతున్న ఓటర్ల జాబితా పునర్విచారణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తీరుపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని సుగుణక్క డిమాండ్ చేశారు. ఓటు చోరీ, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదన్నారు.

సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ ఉపాధ్యక్షులు తారిక్, భీంరావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు జాడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం ఆనంద్, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, టౌన్ అధ్యక్షుడు ఇమ్రాన్, సీపీఎం నాయకులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, గుడిసెల కార్తీక్, కోరింగ మాల శ్రీ, గేడం టీకానంద్, దుర్గం రాజ్‌కుమార్, దుర్గం నిఖిల్, యువజన కాంగ్రెస్ నాయకులు నితిన్, సాయికుమార్, ఉప్పుల కృష్ణ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు



- ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3, (ప్రజాజ్యోతి) :** అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంత ముఖ్యమో.. అర్హులైన ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడటం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు, సహకరిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. మిగిలి ఉన్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లకు సంబంధించిన కారణాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై స్వీప్ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అధికారులంతా మరింత బాధ్యతతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోందని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మిగిలి ఉన్న డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పరిశీలకులకు సమగ్రంగా వివరించారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ చేపడుతున్నారని తెలిపారు. ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మిగిలి ఉన్న ఫారాల పరిష్కారం, ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామని వివరించారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు కలెక్టర్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహకారం లభిస్తోందని తెలిపారు. సమీక్ష అనంతరం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి నిర్మల్ పట్టణంలోని కస్బా, నిర్మల్ గ్రామీణ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై స్థానిక బీఎల్ఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాల పరిశీలన, ఫారాల పరిష్కారం తదితర అంశాలను పరిశీలించారు. ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా, ఉట్నూర్ సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను మాటలతో కాకుండా

# పోరాటాల ద్వారానే సాధించుకోవాలి



- కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య
- ఆర్కే-5 గనిలో ఏఐటీయూసీలోకి భారీగా 104 మంది యువ కార్మికుల చేరిక

**మంచిర్యాల, 3,అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్‌కు ఆర్కే-5 గనిలో భారీగా మద్దతు లభించింది. శనివారం ఆర్కే-5 గని ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 104 మంది యువ కార్మికులు ఏఐటీయూసీ--ఎస్‌సీడబ్ల్యూయూలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య తదితరులు నూతన సభ్యులకు ఏఐటీయూసీ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, కార్మికుల హక్కులను మాటలతో కాకుండా పోరాటాల ద్వారానే సాధించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సేవ్ సింగరేణి జాతా, హెడ్ ఆఫీస్ ముట్టడి, సమ్మె నోటీసు తదితర ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. సమ్మె నోటీసు అనంతరం ఆర్ఎల్‌సీ సమక్షంలో వివిధ దశల్లో జరిగిన చర్చల ద్వారా 24 ప్రధాన డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించినట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతూ సాధిస్తున్న ఫలితాలను కార్మికులు గుర్తిస్తున్నారని తెలిపారు. అగ్రిమెంట్లు చేయించడమే కాకుండా వాటిలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అమలు చేయించే బాధ్యత కూడా తమదేనని నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల కోసం సాధించిన ప్రతి హక్కును కాపాడుకోవడంతోపాటు యాజమాన్యం ఇచ్చిన హామీలు, కుదిరిన ఒప్పందాలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అగ్రిమెంట్లు చేసి చేతులు దులుపుకునే సంఘం ఏఐటీయూసీ కాదని, సాధించిన హక్కులను కాపాడుతూ వాటి అమలుకు నిరంతరం ఉద్యమించే సంఘమని అన్నారు. కార్మికుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సింగరేణి భవిష్యత్తు యువ కార్మికుల చేతుల్లోనే ఉందని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. యూనియన్‌లో యువతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడంతోపాటు బాధ్యతలు, నాయకత్వ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆర్కే-5 గనిలో ఒకేసారి 104 మంది యువ కార్మికులు ఏఐటీయూసీలో చేరడం కార్మిక ఉద్యమానికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. యువ కార్మికులంతా ఐక్యంగా నిలిస్తే హక్కుల పరిరక్షణ కోసం మరింత బలమైన ఉద్యమాన్ని నిర్మించవచ్చని అన్నారు. ప్రతి గనిలో యువ కార్మికులను సంఘటితం చేసి, వారి సమస్యలను గుర్తించి, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడానికి కొత్త గనుల ఏర్పాటు అత్యవసరమని , బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం మరింత చురుగ్గా పాల్గొని కొత్త గనులను దక్కించుకోవాలని కోరారు. కొత్త గనులు ప్రారంభమైతే యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతోపాటు సంస్థ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, అగ్రిమెంట్ల సాధన, వాటి అమలుకు నిరంతర పోరాటాలే ఏఐటీయూసీ బలమని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ అడ్డు శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మీడియా అధికార ప్రతినిధి రాజ్ కుమార్, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు మాడగోని మల్లేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్ రావు, ప్రవీణ్, సత్యనారాయణ, నాయకులు జి.పి. రావు, రెడ్డిపాక లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, సుందిళ్ల నరేష్, బండ మధుకర్ రెడ్డి, భోగ మధునయ్య, మహేందర్, రాజమణి, తిరుమల, చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీలో చేరిన వారిలో సత్యనారాయణ, తిరుపతి, నాగరాజు, పున్నం చందు, మోహన్, ఎస్.కె. ఇమ్రాన్, ఖాదర్ బాబు, హరికృష్ణ, స్వామి, కృష్ణ, సుధీర్, ప్రశాంత్, సాయి, సంతోష్, సతీష్, వరుణ్, రామకృష్ణ, కళ్యాణ్, విద్యాసాగర్, సుధాకర్, శంకర్, తిరుపతి, సారయ్య, శ్యామ్, వంశీ, రవీందర్, ఎల్. రమేష్, మహేశ్వరి, రాజేశ్వరి, రజిత తదితరులు ఉన్నారు. మొత్తం 104 మంది కార్మికులు యూనియన్‌లో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మంచిర్యాల జోన్‌లో పోలీసుల ఆకస్మిక నాకాబంది

- డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు - నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు





**మంచిర్యాల, 3,అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా మంచిర్యాల జోన్ పరిధిలో పోలీసులు ఆకస్మిక నాకాబంది నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ పర్యవేక్షణలో జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఏకకాలంలో విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. అక్రమ రవాణా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ సరఫరాను అరికట్టడం, అనుమానిత వ్యక్తులు, వాహనాలను గుర్తించడం, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నియంత్రించడం, అవాంఛనీయ సంఘటనలను నివారించడం ప్రధాన లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. నాకాబంది సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలు, వ్యక్తులను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లతో పాటు ఇతర అవసరమైన పత్రాలను పరిశీలించారు. అదేవిధంగా వాహనదారుల వివరాలు, వారు ప్రయాణిస్తున్న గమ్యస్థానాలు, వాహనాల్లో ఉన్న వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, సరైన వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. మంచిర్యాల జోన్‌లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు రాబోయే రోజుల్లోనూ నాకాబంది, వాహన తనిఖీలను మరింత కఠినంగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని మంచిర్యాల జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రాయదారి అడవి ప్రాంతంలో మొక్కలు నాటిన కార్యక్రమం





**మామడ అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** మామడ మండలంలోని రాయదారి గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కలిసి వివిధ రకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. అటవీ ప్రాంతాన్ని పచ్చదనంతో నింపడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంక తిరుపతి,ఉప సర్పంచ్ రాథోడ్ గంగు గంగారాం, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ తో పాటు గ్రామస్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హెల్త్ సూపర్వైజర్ సంతోష్



**నేరడిగొండ, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని రోల్‌మామడ గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ.సంతోష్, హెల్త్ అసిస్టెంట్లు తోడసం శంకర్, శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, అంగన్వాడీ టీచర్ ఛాయ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సార్పీ-3 గనిలో కార్మికుడికి తీవ్ర గాయం

- ప్రమాదంపై ఐఎన్టీయూసీ నాయకుల ఆవేదన..
- భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టం చేయాలి

**మంచిర్యాల, 3, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ-3 గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు దుర్గం శంకర్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటనపై ఐఎన్టీయూసీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్య చికిత్స అందించడంతో పాటు, ఆయన కుటుంబానికి సంస్థ యాజమాన్యం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. వివరాల్లోకి వెళితే.. ఎస్సార్పీ-3 గనిలో సపోర్ట్‌మెన్‌గా పనిచేస్తున్న దుర్గం శంకర్ రూఫ్ బోల్టింగ్ స్పానర్స్ తయారు చేస్తున్న క్రమంలో జీఐ పైపును కటింగ్ మిషన్‌తో కట్ చేస్తుండగా యంత్రం జామ్ అయింది. జామ్ అయిన మిషన్‌ను పక్కకు జరుపుతున్న సమయంలో అకస్మాత్తుగా యంత్రం ఆన్ కావడంతో ఆయన కుడిచేతి వేలికి తీవ్ర గాయమైంది. ప్రమాదం జరిగిన వెంటనే తోటి



కార్మికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆర్కే-8 డిస్పెన్సరీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించిన అనంతరం మరింత మెరుగైన వైద్య చికిత్స అవసరమని భావించి హైదరాబాద్‌లోని ఆమోర్ కార్పొరేట్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ఐఎన్టీయూసీ నాయకులు తెలిపారు. గనుల్లో, వర్క్‌షాప్‌లలో, యంత్రాలతో పనిచేసే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే సాంకేతిక లోపాలను ముందుగానే గుర్తించి నివారించాలని సూచించారు. ముఖ్యంగా కటింగ్ మిషన్లు, ఇతర యంత్ర పరికరాల నిర్వహణలో తగిన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు, మెయింటెనెన్స్, ఆపరేటింగ్ విధానాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యమైన లోపాలను

# బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

**9న బడంగ్‌పేట్ సమరభేరికి భారీగా తరలిరావాలి : జలగం ప్రవీణ్**



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** బహుజనుల ఐక్యత, రాజకీయ చైతన్యం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా బీఎస్పీ ముందుకు సాగుతోందని బీఎస్పీ జనగామ జిల్లా నాయకుడు జలగం ప్రవీణ్ అన్నారు. అక్టోబర్ 9న బడంగ్‌పేట్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గ నాయకుడు గుర్రం కుమారస్వామి ఆధ్వర్యంలో శనివారం సమరభేరి సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జలగం ప్రవీణ్ మాట్లాడుతూ మాన్య వర్ కాన్షీరాం చూపిన మార్గంలో బహుజన వర్గాలను ఏకం చేసి సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన వర్గాల ప్రజలు తమ సామాజిక, రాజకీయ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం, హక్కుల సాధన వంటి అంశాలపై చర్చకు సమరభేరి సభ వేదికగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణలో బహుజన రాజ్యాధికార సాధన కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 9న బడంగ్‌పేట్‌లో జరిగే సమరభేరి సభకు జనగామ జిల్లా నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బహుజన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జలగం ప్రవీణ్ కోరారు. మాన్యవర్ కాన్షీరాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజన సమాజాన్ని సంఘటితం చేయాలని అన్నారు. బెహెంజీ మాయావతి నాయకత్వంలో తెలంగాణలో బీఎస్పీని బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మునిగేల వెంకన్న, గుర్రం వేణు, బైరి హరిశంకర్, భాస్కుల కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల గణేష్



**రాయపర్తి అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** బీజేవైఎం జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన పెండ్యాల గణేష్ నియమించడం జరిగింది అని జనగామ జిల్లా అధ్యక్షులు చౌడ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చురుగ్గా పని చేయడమే కాకుండా అలాగే భారతీయ జనతా యువమోర్చా వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించి నేడు నా పై నమ్మకంతో జనగాం జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా నియమించి నందుకు అదే నమ్మకంతోరాబోయే రోజులలో విద్యార్థుల సమస్యల కోసం మరియు నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. ఈ బాధ్యతకు సహకరించిన బిజెపి జనగాం జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ అన్న కు. బీజేవైఎం జనగామ జిల్లా అధ్యక్షులు ఎల్లవేళలా హరీష్ అన్నకు. పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ లేగ మోహన్ రెడ్డి కి. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి కి. రాయపర్తి మండల అధ్యక్షులు నూనె అనిల్ అన్నకి. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింత కింది సంతోష్ అన్న కి. మరియు బిజెపి జిల్లా నాయకులకు. పాలకుర్తి నియోజకవర్గ మండల అధ్యక్షులకు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రావణ్ అన్నకి. ధన్యవాదములు తెలపడం జరిగింది.

## నీట్ పీజీలో ఉత్తమ ర్యాంకు సాధించిన పావన సుధా..



**పరకాల అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో పరకాలకు చెందిన పావన సుధా ఉత్తమ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. పరకాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు ఆరేపల్లి పద్మ, సుధాకర్‌ల కుమార్తె పావన సుధా.. వైద్య విద్యలో వరుస విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. పావన సుధా తన మొదటి ప్రయత్నంలోనే నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించి, వైద్య విద్యను పూర్తి చేశారు. తాజాగా ప్రకటించిన నీట్ పీజీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 6,600వ ర్యాంకు సాధించారు.

ఈ సందర్భంగా పావన సుధా మాట్లాడుతూ.. పీజీలో జనరల్ మెడిసిన్ చదివి, భవిష్యత్‌లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం, వారి కృషి, తన పట్టుదల వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు.

కుమార్తె వరుస విజయాలు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో లింగాల కేదారి అందించిన సేవలను ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గౌరవిస్తుందని, వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని, కుటుంబ సభ్యులకు అన్ని విధాలా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని అన్నారు.

# ఆకాశవాణిలో షైన్ విద్యార్థులు





### 'చిన్నారి లోకం'లో పాటలు, నాటికలు

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03, (ప్రజా జ్యోతి) :** హన్మకొండ కిషన్‌పురలో ఉన్న షైన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరంగల్ ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించిన 'చిన్నారి లోకం' కార్యక్రమంలో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాటలు, నాటికలు, పద్యాలు, స్కిట్, ప్రసంగం, కథ, సాధారణ జ్ఞానం, సూక్తులు తదితర అంశాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు, వేదికపై మాట్లాడే భయాన్ని తొలగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల చైర్మన్ కుమార్ యాదవ్ తెలిపారు. చదువుతోపాటు సహపాఠ్య కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాల హెడ్మాస్టర్ కవితారాణి, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు జయరాజును ఆయన అభినందించారు. కార్యక్రమానికి అవకాశం కల్పించిన ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్, ప్రోగ్రాం ఇన్‌చార్జి నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల కార్యక్రమం అక్టోబర్ 4న ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆకాశవాణి వరంగల్ కేంద్రం ద్వారా ప్రసారం కానుంది. కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

# కాంగ్రెస్ వైఫల్యాలకు ఓటుతో బుద్ధి చెప్పండి!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత సత్తా చాటాలి: ఓయూ జేఏసీ నేత ఇప్ప పృథ్వి రెడ్డి
- నవంబర్ 6 లోపు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపు
- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలను విస్మరించారని మండిపాటు



**దేవరుప్పుల, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నేత ఇప్ప పృథ్వి రెడ్డి విమర్శించారు. శనివారం వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

**హామీలు ఏమయ్యాయి? :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, అలాగే నిరుద్యోగులకు భృతి అందిస్తామని చెప్పి మాట తప్పిందని పృథ్వి రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగ యువతను మోసం చేసిన ఈ ప్రభుత్వ తీరును ప్రశ్నించే అవకాశం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా వచ్చిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు నిరుద్యోగ యువత భవిష్యత్తుకు, పట్టభద్రుల ఆకాంక్షలకు ఇచ్చే ప్రజా తీర్పుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

**నవంబర్ 6 లోపు నమోదు చేసుకోండి :** ప్రభుత్వాన్ని నిలదీయాలంటే పట్టభద్రులు ముందుగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ముందుగా ఓటర్ల జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం అత్యంత కీలకమని గుర్తుచేశారు. అర్హులైన పట్టభద్రులంతా ఎలాంటి ఆలస్యం చేయకుండా చివరి తేదీ అయిన నవంబర్ 6 లోపు తమ పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు





- రూ.2.60 కోట్ల పనులకు శంకుస్థాపన..
- అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారం..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..

**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 33 నెలల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. శనివారం 31వ డివిజన్ పరిధిలోని అవంతి స్కూల్ కాలనీ, హంటర్‌రోడ్ విశాల్ మార్ట్ ఆవరణ, సూర్యోదయ కాలనీ, శ్రీరామ్ హిల్స్, హంటర్ హిల్స్ రోడ్ నంబర్ 3 ప్రాంతాల్లో రూ.2.60 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కాలనీ వాసులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చేపట్టిన పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులను కూడా వేగంగా చేపడుతున్నామని పేర్కొన్నారు.

ప్రజల అభ్యున్నతి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు ఇటువంటి ప్రచారాలను నమ్మకుండా క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించాలని కోరారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌రావు, డివిజన్ ఇన్‌చార్జ్ మార్క విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్‌రావు, జిల్లా నాయకులు సురేష్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు సురేందర్, నాయకులు వేణు, కృష్ణ, అభిలాష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి



- రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి
- పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి
- ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు. ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 1 వ నవంబర్ 2026 నాటికి కనీసం 3 సంవత్సరాల క్రితం డిగ్రీ పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు ఖీశీతీఎ-18 దరఖాస్తును ఏఈఆర్ఓ లకు లేదా నియమిత అధికారికి సమర్పించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ళిట్ట్రిజూం://ఎవశీవశ్రీఖఅస్త్రుఖఱ.అఱఎ.ఱఅ/రిను సందర్శించవచ్చని తెలిపారు. పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఉడుత రవి యాదవ్, భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి రావెల రవి, బీజేపీ పార్టీ ప్రతినిధి బి. జగదీష్, సీపీఎం పార్టీ ప్రతినిధి జోగు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):** హనుమకొండ భద్రకాళి దేవాలయంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఆలయ ఈవో సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు శనివారం కలెక్టరేట్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు భద్రకాళి దేవాలయంలో శరన్నవరాత్రుల మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహోత్సవాల్లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు కోరారు.

## ఆర్థిక సహాయం

**బాలె సత్తెమ్మ, అడ్లూరి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి3 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**



**రాయపర్తి, అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బల్లె సత్తెమ్మ, అడ్లూరి బ్రహ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' తరపున ఒక్కో కుటుంబానికి 3,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పాక్స్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మండల పార్టీ నాయకులు ఐత రామ్ చందర్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, హనుమా నాయక్, పాము మనోహర్, బైరు యాకయ్య, నరేందర్, డికొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి నీ పరామర్శించిన ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి అక్టోబర్ 3 ప్రజా జ్యోతి :** రంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్' గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణ మూర్తి ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఇంటివద్ద పరామర్శించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పాక్స్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, మండల పార్టీ నాయకులు ఐత రామ్ చందర్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, హనుమా నాయక్, పాము మనోహర్, నరేందర్, డికొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వేముల సాంబయ్య గౌడ్



**నర్సంపేట అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి నర్సంపేట జేఏసీకే పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ, టీఎంయూ,ఈయు,సంఘాల జేఏసీ కి మద్దతు ఇవ్వాలని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిపో కార్యదర్శి పిఎన్ రావు తో పాటు కార్మికు సంఘాల నాయకులతో కలిసి కాగడ,బస్ గుర్తులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిపో మిత్రపక్షాల నాయకులు యాదయ్య,బాబు,శ్రీలత, శంకరయ్య,ఎండి పాషా మహిళా ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్ నర్సంపేట విద్యార్థి సంఘం అధ్యక్షులు కటారి ఉత్తమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేశం జన్మదిన వేడుకలు



**రామన్నపేట అక్టోబర్ 3(ప్రజా జ్యోతి) :** పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జె ల్లా వెంకటేశం జన్మదిన సందర్భంగా జిల్లా పరిషత్ విశ్రాంతిభవనంలో శాలువాలు కప్పి సన్మానించినారు కేకు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పినారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటె రమేష్ మాజీ ఎంపిటిసి సాల్వేర్ అశోక్ గుత్త నర్సిరెడ్డి బొడ్డు సాలయ్య మొహమ్మద్ నాసర్ గోదాస్ శ్రీమన్నారాయణ మొహమ్మద్ అక్రమ్ కేశవ్ దాస్ వెంకటేశం కోట సుధాకర్ సాల్వేర్ లింగం బొడ్డు శంకరయ్య కొండ శేఖర్ గౌడ్ కొమ్ము శేఖర్ గొరిగే శేఖర్ గొలుసుల ప్రసాద్ మొహమ్మద్ రిజ్వాన్ మిర్జా ఇనాయ తుల్లా బేక్ ముహమ్మద్ అజార్ మహమ్మద్ జానీ లవణం సాయి సైదాచారి కక్కిరేణి రవీందర్ తెల్ల ప్రసాద్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జువాజి శ్రీకాంత్ పట్టణ మహిళా అధ్యక్షురాలు భైరబోయిన శోభ తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళపై దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు: కేవీపీఎస్



**హాలియా, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీ.కే.మల్లెపల్లి గ్రామసభలో దళిత మహిళ, వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన భౌతిక దాడి అమానుషమని, ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామసభలో ఒక దళిత మహిళను కులం పేరుతో దూషిస్తూ, దాడికి తెగబడటం శోచనీయమన్నారు. బాధితురాలికి వెంటనే పోలీసు రక్షణ కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో దళిత,గిరిజనులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దళితుల ఆత్మగౌరవ పరిరక్షణకు కేవీపీఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు కొండేటి నరేష్, కొండేటి చింటూ,కొండేటి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# జంగా వెంకన్న ను పరామర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ, అక్టోబర్ 03, (ప్రజాజ్యోతి) :** మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ వార్త లక్ష్మణ్ సోదరుడు, కాంగ్రెస్ నాయకులు జంగా వెంకన్న ను శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పరామర్శించారు.వెంకన్న ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి, ఒక చేతిని కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంకన్న స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.వెంకన్న త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పవర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

## – గుడిపల్లి సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి




**గుడిపల్లి, అక్టోబర్ 03, (ప్రజా జ్యోతి) :** చెక్ పవర్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని గుడిపల్లి సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలో సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూల చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌ల మధ్య ఏర్పడే సమస్యలను వ్యక్తిగత విభేదాలుగా కాకుండా గ్రామ పరిపాలన, పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అంశంగా చూడాలని సూచించారు. గ్రామ అభివృద్ధి సజావుగా సాగాలంటే సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పరస్పర సహకారంతో పనిచేయాలని కోరారు.అధికారాలు, బాధ్యతల విషయంలో భేదాభిప్రాయాలు ఉంటే ఘర్షణలకు తావివ్వకుండా చట్టపరమైన విధానాలు, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలు, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పీఎం సూర్య ఘర్ - ముఫ్త్ బిజిలీ యోజన

## – "సేవా సేతు అభియాన్" ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**భువనగిరి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి) :** భువనగిరి పట్టణం లోని విద్యుత్ కార్యాలయం లో పీఎం, సూర్య ఘర్–ముఫ్త్ బిజిలీ యోజన "సేవా సేతు అభియాన్" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ప్రజలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రయోజనాలు,ప్రభుత్వ సబ్సిడీ దరఖాస్తు విధానం,బ్యాంకు రుణ సౌకర్యాలు,సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియ మరియు,విద్యుత్ బిల్లులపై ఆదా వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఎస్ ఈ.కె.సురేష్ కుమార్, డి ఈ టెక్నికల్ సుధీర్ డి ఈ ఆపరేషన్ ఎస్. వెంకటేశ్వర్లు,ఏడి,మచ్చేందర్ ఏఈ సాయి కృష్ణ కెనరా బ్యాంకు,ఎస్ బి ఐ హెచ్డీఎఫ్ ఫ్సీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ,బ్యాంకు యూని యన్ బ్యాంకు తెలంగాణ కోఆపరేటివ్ బ్యాంకు అలాగే పత్రికా విలేకరులు కూడా కార్యక్రమంలో పాల్గొని పీఎం,సూర్య ఘర్ పథ కానికి సంబంధించిన వివరా లను ప్రజలకు తెలియ జేశారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికా రులు,రెడ్ కో సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు మరియు సోలార్ వెండర్లు కలిసి ప్రజలకు పీఎం,సూర్య ఘర్ పథకానికి సంబంధిం చిన సబ్సిడీ,రుణ సౌకర్యం దరఖాస్తు విధానం మరియు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు ప్రక్రియపై ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం అందిం చారు.ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకొని రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులపై ఆదా పొందడంతో పాటు స్వచ్ఛమైన సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ చైర్మన్ తంగెల్లపల్లి శ్రీవాని కుమార్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**పెన్ పహాడ్ అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెన్ పహాడ్ మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో జరిగినది. మృతిని బంధువులు,పోలీస్ వారు తెలిపిన వివరాలప్రకారం పొట్లపహాడ్ గ్రామానికి చెందిన కొండ నాగరాజు 37 సంవత్సరాలు లారి డ్రైవర్ గా పనిచేస్తుంటాడు, నాగరాజు గత కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతుండడంతో, అతను ఈనెల 2 వ తారికున తీవ్ర అస్వస్థకు గురికాగా కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం 108 అంబులెన్స్ ద్వార సూర్యాపేట గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు.అక్కడ చికిత్సపొందుతూ అదే రోజు సాయంత్రం 04.00 లకు మరణించినాడు. మృతుని బార్య కొండ లావణ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు మరియు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి మృతుని బంధువులకు అప్పగించినట్లు ఏయస్ఐ టి.రాములు, పీయస్ పెన్ పహాడ్ తెలియజేశారు

# బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్

– రూ.5 లక్షల అప్పంటూ నమ్మించి.. ఎకరా 20 గుంటలు సేల్‌డీడ్ – రూ.2 లక్షలే ఇచ్చి.. రూ.3 లక్షలకు బౌన్స్ చెక్కులతో తిప్పలు!

– న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు, దళిత సంఘాల నాయకులు



**భువనగిరి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** వలిగొండ,మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన పడమటి,సంతోష్ రెడ్డి మార్టిగేజ్ పేరుతో నమ్మించి ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్ చేయించుకుని మోసం చేశారని ఆరోపిస్తూ భువనగిరి మండలం సమాత్‌పల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ బిచ్చాల సరిత భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ని ఆశ్రయించారు. కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పుగా అడగగా.. భూమిని మార్టిగేజ్ పెడితే రుణం ఇస్తామని నమ్మించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 20న తన భర్త గణేష్‌ను భువనగిరి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి, మార్టిగేజ్ పత్రాలంటూ సంతకాలు చేయించారని, అనంతరం సర్వే నంబర్లు 96, 97లోని ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి నాలుగు దఫాలుగా కేవలం రూ.2 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.3 లక్షలకు నగదు లేని చెక్కులు ఇచ్చి, ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని తెలిపారు. అప్పు తిరిగి చెల్లించి భూమిని ఇవ్వాలని కోరినా స్పందించలేదని, భూమిని ఇప్పటికే ఇతరులకు విక్రయించానని బెదిరించినట్లు సరిత ఆరోపించారు. గత ఆగస్టు 19న భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, దీంతో ఎస్పీని ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు. భూమిని తిరిగి తమ పేరుపై నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులను మోసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ డిమాండ్ చేశారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, దళిత సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ మైలారం వెంకటేష్, కర్తల శ్రీనివాస్, ఇటికల దేవేందర్ మాదిగ, బొల్లెపల్లి అశోక్, కుతాడి సురేష్, ఎండి షఫీక్ అహ్మద్ మాజీ కౌన్సిలర్, అందే సాయి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గ్రాడ్యుయేట్లు

# తమ ఓటుతో సమాధానం చెప్పాలి

– అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

– అశోక్ బలవంతుల



**ఆలేరు, అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని యువజన నాయకుడు, గ్రాడ్యుయేట్ అశోక్ బలవంతుల పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదని, పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేసే ప్రజాస్వామ్య వేదికగా నిలుస్తాయని అశోక్ బలవంతుల అన్నారు.

తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ విధానాలు, హామీలు, పనితీరుపై పట్టభద్రులు తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేయవచ్చని పేర్కొన్నారు.

2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ, అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం--18 ద్వారా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈసారి తాజా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నందున గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 6, 2026లోపు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తన పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకుని, తమ ఓటు హక్కును ఎవరూ కోల్పోకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు."పట్టభద్రుల ఓటు కేవలం హక్కు మాత్రమే కాదు... భవిష్యత్తును ప్రశ్నించే ప్రజాస్వామ్య ఆయుధం. అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి" అని అశోక్ బలవంతుల అన్నారు.

# రైతు సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

– రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

– తుమ్మల వీరారెడ్డి సిపి(ఎం) జిల్లా కార్యదర్శి



**నార్కట్ పల్లి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** నార్కట్ పల్లి మండలం లోనిఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నవం బర్ 15 నుండి 18 వరకు నల్గొండ పట్టణ కేంద్రంలో జరుగు రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.... నవంబర్ 15వ తేదీన నల్లగొండ ఎన్జీ కాలేజీలో బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరెంటు కోతల్ని నివారించి 16గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని కోరారు. ఒక పక్క ఎల్ నీనో మరోపక్క ప్రభుత్వ విధానాలు రైతులను అగాధంలోకి నెడుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతాంగాని ఆదుకోవడం కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ముఖ్యమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా ఉన్న జ్ఞానేష్ కుమార్ ఇద్దరు ఎలక్షన్ కమిషనర్ కాదని ఏకపక్ష నిర్ణయాలతో ఒక పార్టీకి ఏజెంట్ గా మారారని ఆరోపించారు. ఆయన ఏకపక్ష నిర్ణయాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరాలు వచ్చాయని అన్నారు. ఇవి ఏమి పట్టించుకోకుండా ముందుకు పోవడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఫారం 6 మార్పులు ఓటర్ల జాబితా డేటా కేంద్రీకరణ పై ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసిన ఏకపక్షంగా నిర్ణయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల వ్యవస్థ పైన చిత్తశుద్ధి ఉంటే జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న మండల కమిటీ సభ్యులు చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, దండు రవి, బుల్లెద్దు సైదులు, కట్ట రామచంద్రం,శాఖ కార్యదర్శి దండు నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు దండు శంకర్, దండు శంకరయ్య పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు బాటలు..

# అమీనాబాద్‌లో కొత్త అంగన్వాడి భవనం






**అనంతగిరి,అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన అంగన్వాడి భవనం అందుబాటులోకి వచ్చింది. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడి భవనాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ సేవలు అందించడంలో అంగన్వాడి సిబ్బంది ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అమీనాబాద్‌లో నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమని, దీని ద్వారా చిన్నారులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించడంతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని అన్నారు.

అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే సేవలు మరింత సౌకర్యవంతంగా చేరేలా చూడాలని సూచించారు. భవనాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే ప్రతి సేవను అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా అందించాలని సిబ్బందికి సూచించారు.

నూతన భవనం గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అంగన్వాడి సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారి




**కొండమల్లేపల్లి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి) :** కొండమల్లేపల్లి మండల విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారి ఘన విజయం సాధించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా మన మయ సంఘం ఉపాధ్యక్షులు సొనగంటి గోవర్ధనచారి, అధ్య క్షులు సల్లోజు శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి నారోజు సైదా చారి, గౌరవ అధ్యక్షులు కర్నెకంటి జంగాచారి, మాజీ అధ్యక్షులు పసునూరి శేఖర్‌చారి, చెన్నయ్యచారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన అధ్యక్షు డిగా పసునూరి నరేంద్రచారిని, ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్‌చారిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంఘం సభ్యులు అభినందించారు. సంఘం అభివృద్ధికి, వడ్రంగి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.



## విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



**ప్రజా జ్యోతి, అక్టోబర్ 3 పోతంగల్** విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సామాజిక సేవకుడు, సీనియర్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎం ఏ హకీమ్ శనివారం పోతంగల్ లోని తన పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులను శాలువలు, పూలమాలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ హకీమ్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను ప్రజలకు తెలియజేయడంలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విలేఖరి అంటే కేవలం వార్తలు రాయడం మాత్రమే కాకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం వంటి బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పని చేస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి మండలాల విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గైని.గజానంద్, ప్రధాన కార్యదర్శిగా మోరే. జీవన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సమీర్, కోశాధికారిగా గైనిశంకర్, ముఖ్య సలహాదారులుగా నూతంకి శ్రీనివాస్, వడ్డే నర్సింలు, కార్యవర్గ సభ్యులు సింహాద్రి, గుండ్ల రవి, భీంరావు, వినోద్ ఈ నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

## అంత్యక్రియలకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



**కోటగిరి, అక్టోబర్ 3, ప్రజా జ్యోతి.** కోటగిరి మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన టేకుల గంగారం అనే వ్యక్తి మృతి చెందడం జరిగింది. ఆయన అంత్యక్రియల కోసం బి.ఆర్.ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం మాజీ ఎంపీటీసీ శివకాంత్ 5000, రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబానికి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మండల నాయకులు తెల్ల రవికుమార్, పోతంగల్ మండల నాయకులు సూధం నవీన్, స్థానిక బి.ఆర్.ఎస్ నేతలు బేగం శ్రీనివాస్, మహాదేవ్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు





**ఇందల్వాయి: ప్రజా జ్యోతి, అక్టోబర్ 3** ఇందల్వాయి మండల కేంద్రం పరిధిలోని టోల్ ప్లాజా వద్ద భద్రతా చర్యలు, రహదారి సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఇప్పటివరకు పలువురు అమాయకులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని స్థానికులు పేర్కొంటున్నారు. టోల్ ప్లాజా ద్వారా భారీగా రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రయాణికుల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, టోల్ ప్లాజా యాజమాన్యం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ హైవే సమస్యలకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**టోల్ ప్లాజా నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు**

ఇందల్వాయి మండల కేంద్రం పరిధిలోని టోల్ ప్లాజా వద్ద భద్రతా చర్యలు, రహదారి సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఇప్పటివరకు పలువురు అమాయకులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని స్థానికులు పేర్కొంటున్నారు. టోల్ ప్లాజా ద్వారా భారీగా రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రయాణికుల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, టోల్ ప్లాజా యాజమాన్యం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ హైవే సమస్యలకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. బ్రిడ్జి టోల్ ప్లాజా వద్ద తక్షణం భద్రత చర్యలు ప్రమాదాలను అరికట్టాలి రోడ్డు మరమ్మతులు వీధి దీపాలు హెచ్చరిక బోర్డులు రక్షణ గాడ్లు కల్పించాలి. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలపై విచారణ జరిపి భవిష్యత్తులో ప్రాణం నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

## గర్గుల్‌లో ఘనంగా అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలు

- ప్రేమ, సత్య సందేశాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**కామారెడ్డి రూరల్, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలను అక్టోబర్ 4న భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మెహర్ బాబా బోధించిన ప్రేమ, సత్యం, సేవ, ఆధ్యాత్మికత వంటి సందేశాలను ప్రజలకు చేరవేసేలా రోజంతా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు ఉదయం 7 గంటలకు పుష్పమాల అలంకరణ, ప్రార్థన, హారతి కార్యక్రమాలతో ప్రారంభమవుతాయి. ఉదయం 7.15 గంటలకు ధుని కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 7.30 గంటలకు సప్తవర్ణ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుంది. 7.45 గంటలకు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు మెహర్ బాబా పల్లకి సేవ నిర్వహించనున్నారు. అనంతరం 10.15 గంటలకు వేదికపై స్వాగత ఉపన్యాసం ఉంటుంది. 10.20 గంటలకు గర్గుల్ సెంటర్‌కు చెందిన భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 10.30 గంటల నుంచి వివిధ మెహర్ బాబా కేంద్రాలకు చెందిన ప్రేమికులు భజనలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించడంతో పాటు ప్రేమ, సత్యం, ఆధ్యాత్మిక జీవన విధానం వంటి అంశాలపై సందేశాలను అందించనున్నారు. ఈ సందర్భంగా మెహర్ బాబా బోధనలు, మానవత్వం, ప్రేమ, సత్యం, సేవా భావం వంటి విలువలను గుర్తుచేసుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మెహర్ బాబా ప్రేమికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మధ్యాహ్నం 1.15 గంటలకు కార్యక్రమానికి సంబంధించిన ప్రకటనలు, అనంతరం 1.30 గంటలకు హారతి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రేమ విందు, మహాప్రసాదం కార్యక్రమంతో వార్షికోత్సవ వేడుకలు ముగియనున్నాయి. భక్తులు, మెహర్ బాబా అభిమానులు, ఆధ్యాత్మిక సాధకులు ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## ఇంచార్జ్ ఏడీఏగా ప్రవీణ్ చారీ బాధ్యతల స్వీకరణ



**నారాయణఖేడ్, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** నారాయణఖేడ్ ఇంచార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడీఏగా ప్రవీణ్ చారీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నాగల్‌గిద్ద మండల వ్యవసాయ అధికారిగా ఎంఏఓ విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించడంతో నారాయణఖేడ్ ఏడీఏగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చారీ మాట్లాడుతూ..నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తన విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అందించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ చారీకి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ ఛాంపియన్ కార్యక్రమం



**నర్సాపూర్ 3అక్టోబర్ (ప్రజాజ్యోతి)** నియోజకవర్గంలోని శనివారం నాడు నర్సాపూర్, శివంపేట, చిలిపిచేడు, కౌడిపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ ఛాంపియన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ పాల్గొని తాను మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందిస్తూ, గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పోషణ, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారందరూ పోషణ ఛాంపియన్లని కొనియాడారు. ముఖ్యంగా "ఆరోగ్యమే మహాభాగ్యం" అని, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తధానంతరం నర్సాపూర్ సీడీపీవో హేమా భార్గవి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసుకున్న కిచెన్ గార్డెన్లలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో భాగంగా వినియోగించాలని సూచించారు. సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారుచేసి అందించడం ద్వారా తల్లులు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.

## సేంద్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

- రైతులకు శెనగ, తెల్ల కుసుమ విత్తనాల పంపిణీ

**నారాయణఖేడ్, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** నూతన వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ సేంద్రీయ పద్ధతులను పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీ వినోద్ పాటిల్ సూచించారు. శనివారం నాగల్గిద్ద మండలంలోని రైతు వేదికలో నారాయణఖేడ్ ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో సాగు చేసే శెనగ, తెల్ల కుసుమ పంటల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్ మాట్లాడుతూ..రైతులకు మేలు చేసే కార్యక్రమాలను నిర్వహించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేంద్రీయ విధానాలతో సాగు చేపట్టి పంట దిగుబడులను పెంచుకోవడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏ ప్రవీణ్ చారి, ఆత్మ డైరెక్టర్ శ్రీకాంత్ స్వామి, ఏఈఓలు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.







## 365 రోజులు రోడ్లపై మురికి మున్సిపల్ కార్యాలయం ఉన్నది దేనికి

- జహీరాబాద్ పట్టణంలోని గొప్ప గొప్ప నాయకులు పెద్దపెద్ద అధికారులు తిరిగాడేది
- రోడ్డుపైనే కనీసం సుమోటోగానైనా పురపాలక సంఘంపై కేసు రిజిస్టర్ చేయరు
- జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నేత

**జహీరాబాద్, అక్టోబర్ 03 ( 0 ప్రజా జ్యోతి న్యూస్ )** పట్టణంలో పారిశుద్ధ్యం లోపించి రోడ్లపై మురికి నీరు చేరుకొని సామాన్య ప్రజలకు రాకపోకలకు చాలా ఇబ్బందిగా తయారైంది. కొన్ని సందర్భాల్లో ప్రజలు మురికిని తప్పించుకొని వెళ్లే క్రమంలో ప్రమాదాల బారిన పడి గాయాల పాలు అవుతున్నారు. పురపాలక సంఘంలో వందకు పైగా పారిశుద్ధ్య కార్మికులు ఉ న్నప్పటి కీ జహీరాబాద్ పట్టణంలో ఎక్కడ చూసినా చిత్తు కాగితాలు చెత్తకుప్ప లతో వీధి పశువులు వీధి కుక్కలతోని రోడ్లపై మురికి నీరు చేరి మురికి కాలువ లలో మురికి పేరుకు పోయి విపరీతమైన దోమలు దీని మూలంగా ప్రజలు ఎంతో మంది డెంగు మలేరియా మొదలగు వ్యాధులతోని ఆస్పత్రుల పాలవు తున్నారు వాడల్లో నివసించే చిన్న పిల్లలకు అనేక రకాల వ్యాధులు సోకి తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకునే పరిస్థితి లేదు ఇక్కడ చూస్తున్న దృశ్యం జహీరాబాద్ పట్టణంలోని మోహన్ థియేటర్ దగ్గర ప్రతిరోజు కనిపిస్తుంది ఈ దృశ్యాన్ని ప్రతిరోజు వార్డు మెంబర్ కాడి నుండి జహీరాబాద్ శాసన శాసన సభ్యుని వరకు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ నుండి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ వరకు పురపాలక సంఘం పారిశు ద్ధ్య సిబ్బంది కాడి నుండి పురపాలక సంఘం కమిషనర్ వరకు ప్రతిరోజు చూస్తున్న పట్టించుకునే పరిస్థితి లేదు ఇది ఎక్కడో ఈ దృశ్యం మారుమూల పల్లెటూరులో అంటే కనీసం అధికారులకు గాని నాయకు లకు గాని తెలవలేదు అని అనుకో వచ్చు కోట్ల రూపాయల జనరల్ ఫండ్ నిధులున్న పురపాలక సంఘం పరిధిలోనిది ఈ దారి గుండా ప్రతిరోజు అనేక మంది విద్యావంతులు, విద్యార్థులు కళాశాలల ఉ పాధ్యాయులు తిరుగాడుతూ ఈ మురికిని భరిస్తున్నారు. తప్ప ఒక అడుగు ముందుకు వేసి కనీసం పురపాలక సంఘం అధికారులకు తమ వంతు బాధ్యతగా కూడా ఎవరు తెలియజేయడం లేదు సమాజం ఇలా సమస్యలను భరించడానికి తయారై పోయింది కనీసం అధికారు లు తమరైన ప్రజల పక్షాన నిలిచి ఇలాంటి పరిస్థితు లను దూరం చేసి ప్రజలను అనారోగ్యాలు దుర్వాసనల నుండి కాపడవలసిందిగా జహీరాబాద్ ప్రజల పక్షాన జాగో తెలంగాణ కోరడ మైనది.



## ప్రాణాలను కాపాడిన పైలట్‌కు రావి ఆకుపై వినూత్న గౌరవం



**నారాయణఖేడ్, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** విమానంలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా వ్యవహరించి ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ శివకుమార్ వినూత్నంగా గౌరవం తెలిపారు. కెప్టెన్ స్మిత్ మచ్చర్ చిత్రాన్ని రావి ఆకుపై చేతితో లీఫ్ కటింగ్ ఆర్ట్‌గా రూపొందించి, ఈ కళాకృతిని ఆయనకు అంకితం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ఆయన ధైర్యం నన్ను ఎంతో ప్రభావితం చేసింది. నా కళ ద్వారా ఆయనకు గౌరవం తెలియజేయాలనిపించింది. ఆయన త్వరగా కోలుకుని ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

## రాష్ట్రస్థాయికి ఇబ్రహీంనగర్ పాఠశాల విద్యార్థులు




**చిన్నకోడూరు, అక్టోబరు03, (ప్రజాజ్యోతి):-** మెదక్ జిల్లాలోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించిన అండర్--14, అండర్--17 బాల, బాలికల ఉమ్మడిటేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. అండర్--17 బాలుర విభాగంలో లిఖిత్ బంగారు పతకం సాధించగా, బాలికల విభాగంలో రక్షిత తృతీయ స్థానం, మాధురి దివ్యశ్రీ నాలుగో స్థానం సాధించారు. అండర్--14 బాలికల విభాగంలో తనుశ్రీ బంగారు పతకం, అక్షయ తృతీయ స్థానం సాధించగా, అండర్--14 బాలుర విభాగంలో ఎండీ ఆశిష్ ఐదో స్థానం సాధించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వీరంతా త్వరలో యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి జిల్లాల్లో జరిగే పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొననున్నారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులతో పాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ గుండి ప్రవీణ్ ను ప్రత్యేకంగా అభినందించారు

## పేదలకు అండగా సీఎం సహాయ నిధి



**చిన్నకోడూరు, అక్టోబరు03, (ప్రజాజ్యోతి):-** ఆపద సమయంలో పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా మారిందని కాంగ్రెస్ నాయకులు అజ్జు యాదవ్ అన్నారు. చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కును ఆయన అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు చెక్కు అందించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని అజ్జు యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చిక్కుడు అనిల్ కుమార్, గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

## పోషకాహారంతోనే కుటుంబ ఆరోగ్యం

● మన పోషణమన కుటుంబానికి బలం
● డీడబ్ల్యూఓ శారద





**చిన్నకోడూరు, అక్టోబరు03, (ప్రజాజ్యోతి):-** ఆరోగ్యకరమైన బాల్యంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని డీడబ్ల్యూఓ శారద అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషణ మాసం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుదినుసులతో పాటు ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలను వినియోగించడం ద్వారా అధిక ఖర్చు లేకుండానే శరీరానికి అవసరమైన పోషకాలను అందించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు అవసరమైన పోషకాలను తీసుకోవాలన్నారు. పోషణ మాసం కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబానికి సమతుల్య ఆహారం, పోషక విలువలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడవే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సుచరిత, ఎంపీడీఓ జనార్ధన్, ఎమ్మార్వో సలీం, ఎంపీఓ శ్రీనివాసరావు, సూపర్వైజర్లు మహాలక్ష్మి, సుజాత, అంగన్వాడిటీచర్లు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ వెంటనే రాజీనామా చేయాలి




**సిద్దిపేట, అక్టోబర్ 03 ,(ప్రజాజ్యోతి):** ఎన్నికల సంఘం పనితీరుపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పుట్ల హేమంత్ కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. పుట్ల హేమంత్ మాట్లాడుతూ.. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే ఎన్నికల సంఘం కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించబడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం 90 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించబడిన అంశాన్ని ప్రస్తావిస్తూ, దీనిపై సమగ్రంగా సమీక్ష జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హేమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి రోహిత్, జిల్లా నాయకులు వినయ్, కుమార్, సాయి, శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి పనులకు వేగం పెంచాలి




**సిద్దిపేట, అక్టోబర్ 03 ,(ప్రజాజ్యోతి):** గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు పురోగతితో పాటు భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు, కాలువల నిర్మాణం, సవరించిన అంచనాలు తదితర అంశాలపై మంత్రులు అధికారులతో చర్చించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు 2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేశారు. 2013 నాటికి ప్రాజెక్టులో సుమారు 57 శాతం పనులు పూర్తయ్యాయని, అనంతరం భూసేకరణ, పునరావాసం తదితర అంశాల్లో నెలకొన్న సమస్యలతో పనులుమందగించాయని, ప్రస్తుతం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణలో సాధించిన పురోగతిని అధికారులు మంత్రులకు వివరించారు. మిగిలిన భూముల సేకరణను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రులు సూచించారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 17 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. పెండింగ్ పరిహారాల చెల్లింపులతో పాటు పునరావాసానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని మంత్రులు ఆదేశించారు. వివాహిత కుమార్తెలకు ఆర్అండ్ఆర్ ప్రయోజనాలు, పాత, కొత్త ముంపు ప్రాంతాల్లోని కుటుంబాలకు సంబంధించిన అంశాలపైనా సమీక్షించారు. గౌరవెల్లి కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే నిధులు విడుదల చేసి పలువురు లబ్ధిదారులకు పరిహారం చెల్లించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన భూసేకరణను పూర్తి చేసి కాలువల నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. ప్రాజెక్టుకు అవసరమైన తాజా పర్యావరణ అనుమతులపై అధికారులు మంత్రులకు వివరాలు అందించారు. కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పనులు ముందుకు సాగేలా సమన్వయం చేయాలని మంత్రులు సూచించారు. భూసేకరణ, పునరావాసం, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల తదితర కారణాలతో గౌరవెల్లి రిజర్వాయర్, కాలువలకు సంబంధించిన సవరించిన అంచనాలను అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. వీటిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. ఎంఎంఆర్ ప్యాకేజీ-3 పనులు, అదనపు నిర్మాణాల ప్రతిపాదనలు, ప్రాజెక్టు తదుపరి కార్యాచరణపై కూడా మంత్రులు అధికారులతో చర్చించారు. భూసేకరణ, పునరావాసం, రెవెన్యూ, నీటిపారుదల, పర్యావరణ అనుమతులకు సంబంధించిన అంశాలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరగా పూర్తి చేసి, మిగిలిన పనులను నిర్ణీత లక్ష్యాల మేరకు పూర్తి చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ--పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, ఈఎన్‌సీ ఓఅండ్ఎం మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● అంగన్వాడి సెంటర్లో ఘనంగా పోషణ వారోత్సవాలు ● ఐసిడిఎస్ సిడిపిఓ ఎల్లయ్య




**దౌల్తాబాద్, అక్టోబర్ 03 ( ప్రజా జ్యోతి )** అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల గర్భిణీలు, బాలింతలు, శిశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఓ ఎల్లయ్య అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో రెండవ అంగన్వాడి సెంటర్లో ఘనంగా పోషణ వారోత్సవాలను నిర్వహించమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార వైవిధ్యం, ప్రోటీన్ సమృద్ధిగా ఉన్న ఆహారం, పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన



కల్పించారు. దుబ్బాక ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పోషణ్ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ (గర్భిణీలు, బాలింతలు) ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా ఒక పూట సంపూర్ణ పోషకాహారం, అంగన్‌వాడీ ప్రీ-స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలను ఉద్దేశించి మాట్లాడుతూ, గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యం, పోషకాహారం మరియు శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య ప్రీ ప్రైమరీ స్కూల్ ఎడ్యుకేషన్ తో ఎంతో కీలకమైనదని తెలిపారు. ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు మరియు వివిధ కార్యకలాపాల ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక, సామాజిక, భాషా మరియు మేధో వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఈ పునాది విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ శ్యాంసన్, మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజూ సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తగిన మోతాదులో తీసుకోవాలని తెలిపారు. వైద్యుల సూచన మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు మరియు కుటుంబ సభ్యులు రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను కూడా భాగంగా చేసుకోవాలని సూచించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల్లో పీచు, ఖనిజాలు మరియు ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. స్థానికంగా సులభంగా లభించే చిరుధాన్యాలను వివిధ రకాల వంటకాల రూపంలో తీసుకోవడం ద్వారా ఆహారంలో వైవిధ్యాన్ని పెంచుకోవచ్చని సూచించారు. అశ్రిత స్వచ్ఛంద సంస్థ ఎన్జీవోజిల్లా కో ఆర్డినేటర్ గణేష్ మాట్లాడుతూ బాల్యవివాహాలకు నో చెప్పండి -- బాలల భవిష్యత్తును కాపాడండి అనే నినాదంతో ముందుకు సాగాలని బాల్యవివాహాల వల్ల బాల, బాలికల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని, తల్లిదండ్రులు, ప్రజలు బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలని కోరారు. సర్పంచ్ దేవిగారి ఆంజనేయులు, మాట్లాడుతూ తమ గ్రామంలోని గర్భిణీ, బాలింతలకు, పిల్లలకోసం ఇంత మంచి అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, గ్రామ లబ్ధిదారులు అందరు ఇట్టి కార్యక్రమలలోని తెలిపిన పోషణ మరియు ఆరోగ్య సలహాలు పాటిస్తూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గర్భిణీ బాలింతలకు రక్తహీనతపై మరియు పిల్లలకు టీకాలు ఇతర ఆరోగ్య సలహాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బేటి బచావో బేటి పడావో ప్రోగ్రాం జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ద్వారా రెండవసారి ఆడపిల్ల పుట్టిన చిన్నారుల కొరకు సర్పంచ్ ,ఉపసర్పంచ్ చేతుల మీదుగా బేబీ కిట్స్ పంపిణీ చేశామన్నారు. గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన మరియు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఒక్కరి తోటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక ,ఉప సర్పంచ్ రేవతి, వార్డ్ సభ్యులు నరేష్, భాను, అశ్రిత ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఏఎన్ఎం శైలజ, ఆశ వర్కర్లు, దౌల్తాబాద్ సెక్టార్ పరిధిలోని అందరూ అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సమర్థ మహారాజ్ సహకారంతో ట్రై సైకిళ్ల పంపిణీ

● మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత రవిందర్





**దుబ్బాక, అక్టోబర్ 03(ప్రజా జ్యోతి):** ప్రజలకు దైవ అనుగ్రహం కల్పించడంతో పాటు పేదలకు సేవ చేయడం స్వామి సమర్థ మహారాజ్ సేవా గుణానికి నిదర్శమని మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత- రవిందర్ అన్నారు. దుబ్బాక లోని స్వామి సమర్థ మహారాజ్ వారి సహకారంతో రూ. 5.50 లక్షల విలువైన ట్రై సైకిళ్లను 11 మంది దివ్యాంగులకు శుక్రవారం రాత్రి వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు దైవచింతన కల్పించడంతోపాటు తన వంతు సహాయంగా గ్రామాలకు సీసీ కెమెరాలు అందించడం, దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్ పంపిణీ చేస్తూ స్వామి సమర్థ మహారాజ్ తన సేవా గుణాన్ని చాటుతున్నారన్నారు. భగవంతుని ఆశీస్సులతో, స్వామి సమర్థ మహారాజ్ చల్లని చూపుతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు బండి శ్రీలేఖ -రాజు, తునికి సురేష్, చాంద్ మియా, సర్పంచులు గుర్రాల శ్రీనివాస్, రాంజానాయక్, మాడుగుల నర్సింలు, నరేందర్ రెడ్డి, అరుణ రాజేశం, కాంగ్రెస్ నాయకులు మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పండుగ వాతావరణం..
## పోషణ సంబరాల్లో అన్న ప్రసన్నాలు

● చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి ● సూపర్ వైజర్ పుష్పలత




**జగదేవపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్ వైజర్ పుష్పలత అన్నారు. శనివారం మండల పరిధిలో అలిరాజ్ పేట అంగన్వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు, అన్నప్రసన్నా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ పెద్దపైడి సరిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో అంగన్వాడీ కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు, తల్లులు, అంగన్వాడీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్ వైజర్ పుష్పలత హాజరై చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తొలి దశ నుంచే పౌష్టికాహారం ఎంతో కీలకమని అన్నారు. పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, బరువు, ఎదుగుదలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, ప్రాథమిక విద్యకు సంబంధించిన సేవలు అందుతున్నాయని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని సూచించారు. అన్న ప్రసన్నా కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు తొలిసారిగా అన్నం తినిపించి, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తల్లులు పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా సిబ్బంది తెలిపారు. పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం, పరిశుభ్రమైన పరిసరాలు కల్పించడం, ఆరోగ్య పరీక్షలు చేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రమ్య, శిరీష ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్త కవిత, మహేశ్వరి సిబ్బంది, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## గురునానక్ విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల సందడి..

- 25 ఏళ్ల అనుబంధానికి ప్రతీకగా ఘనంగా సమ్మేళనం
- దేశ విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు




**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** గురునానక్ విద్యాసంస్థల ప్రాంగణం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో సందడిగా మారింది. “25 సంవత్సరాలు -- ఒకే కుటుంబం” అనే సందేశంతో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని, గురునానక్ విద్యాసంస్థల ప్రాంగణం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో సందడిగా మారింది. వివిధ విద్యా సంవత్సరాలు, విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి కూడా ప్రత్యేకంగా హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గురునానక్ సంస్థల ఉపాధ్యక్షుడు, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ... పూర్వ విద్యార్థులు విద్యాసంస్థతో కొనసాగిస్తున్న అనుబంధం అభినందనీయమన్నారు. విద్యాసంస్థ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

**ఒకచోట చేరి జ్ఞాపకాలను పంచుకున్నారు...:** “25 సంవత్సరాలు -- ఒకే కుటుంబం” అనే నినాదంతో నిర్వహించిన సామూహిక ఛాయాచిత్ర కార్యక్రమం పూర్వ విద్యార్థుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. పాత స్నేహితులు, అధ్యాపకులు ఒకచోట చేరి జ్ఞాపకాలను పంచుకోవడం ఆత్మీయ వాతావరణాన్ని తీసుకొచ్చింది.

ఈ సందర్భంగా విద్యాసంస్థలో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో పనిచేస్తున్న వారు తమ వృత్తి ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకోవడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 20న నిర్వహించనున్న గురు నానక్ విద్యాసంస్థల రజతోత్సవ వేడుకలకు ఈ సమ్మేళనం ముందస్తు కార్యక్రమంగా నిలిచిందని తెలిపారు.

## కేబిదొడ్డి వద్ద బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- 20సంవత్సరాల రోడ్డు సమస్యను పరిష్కారం
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి తోనే రోడ్డు పనులు ప్రారంభం
- సుల్తాన్ పల్లి సర్పంచ్ ఎలుగని ప్రభాకర్ గౌడ్





**రాజేంద్రనగర్, అక్టోబర్ 03 (ప్రజా జ్యోతి) :** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి తోనే రోడ్డు పనులు జరుగుతున్నాయని సుల్తాన్ పల్లి సర్పంచ్ ఎలుగని ప్రభాకర్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామపంచాయతీ కేబి దొడ్డి గ్రామం నుండి షాబాద్ రోడ్డు వరకు దాదాపు కిలోమీటర్ దూరం రోడ్డులో భూములు కోల్పోతున్న భూ యజమాని తనకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో సమస్య పరిష్కారం కాకుండా అలాగే ఉండడంతో ప్రయాణికులు వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం పై కేబి దొడ్డి గ్రామ వార్డు సభ్యులు సుమిత్ర మల్లికార్జున్, సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ దండు ఇస్తారిల దృష్టికి తీసుకుపోవడంతో వారు పలుమార్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి సమస్యను తీసుకుపోయి పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని విన్నవించడంతో గత కొంతకాలం నుంచి కోర్టు కేసులు వేసిన వారితో మాట్లాడి పలు మార్లు చర్చలు జరిపి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. శనివారం గ్రామం నుంచి కేబిదొడ్డి గ్రామం నుంచి షాబాద్ రోడ్డు వరకు 25 ఏళ్లుగా నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సుల్తాన్ పల్లి సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచులు దండు ఇస్తారి, సిద్ధేశ్వర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ దండు శివ, వార్డు సభ్యురాలు సుమిత్ర మల్లికార్జున్ నాయకులు, కాసుల బాలరాజు గౌడ్,సిద్ధిక్, బండ్లగూడం శివకుమార్, దండు మురళి మంద శ్రీనివాస్, బైండ్ల నరసింహా, మంద యాదయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అభినందనలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,అక్టోబర్ 03, ప్రజాజ్యోతి :** కీలక సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి 174 మంది ప్రాణాలను కాపాడేందుకు చేసిన కృషికి క్యాప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలోని జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, క్యాప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసం, విధి నిబద్ధత, సమయస్ఫూర్తిని కొనియా డారు. ఆపద సమయంలో ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి మానవ ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నం అభినందనీయమని అన్నారు. “మనిషి జీవితం ఎంతో విలువైనది”. ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నం గొప్ప మానవతా సేవ. క్యాప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యం,విధి నిబద్ధత,బాధ్యతాయుత మైన నిర్ణయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకం”అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. క్యాప్టెన్ స్మిత్ మచ్చర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మల్లాపూర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆపద సమయంలో ధైర్యంగా ముందుండి బాధ్యత నిర్వర్తించిన క్యాప్టెన్ స్మిత్ మచ్చర్‌కు మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలు బలి తీసుకున్న ప్రాణాలు..

### పూడూరులో విషాద ఘటన





- ఇద్దరు చిన్నారులను వెంట తీసుకెళ్లిన తల్లి
- బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం

**పరిగి, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గూర్తి గ్రామ శివారులో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత తన ఇద్దరు చిన్నారులను బావిలో పడవేసి, అనంతరం తానూ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మాటుగూడెం గ్రామానికి చెందిన మమత అనే మహిళ తన భర్త రాజుతో శుక్రవారం ఉదయం గొడవపడి, తన ఇద్దరు పిల్లలు సాకేత్ (8), జనశ్రీ (4)లను వెంట తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు.

దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సోమన్‌గూర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి సమీపంలో మమతకు చెందిన చెప్పులు, బ్యాగు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు బావిలో గాలింపు చేపట్టగా మమత, జనశ్రీ, సాకేత్ మృతదేహాలు లభించాయి.. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి

ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డులో విషాదం

- నాలుగు నిండు ప్రాణాలు బలి - అదుపుతప్పి బోల్తాపడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 40 మందికి గాయాలు
- అంత్యక్రియలకు వెళ్తుండగా ఘోరం - ఘటనాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- క్షతగాత్రులకు తక్షణ వైద్యం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు













**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి) :** అంత్యక్రియలకు వెళుతున్న వారిని మృత్యువు వెంటాడింది. అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. అదుపుతప్పిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడటంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసారం గ్రామానికి చెందిన వారు వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం చింతకుంట గ్రామంలో నివసిస్తున్న బంధువు అంత్యక్రియలకు బస్సులో బయలుదేరారు. అనంతగిరి ఘాట్ రోడ్డులో దిగుతున్న సమయంలో బస్సు అదుపుతప్పి మలుపు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కొందరు బస్సు కింద చిక్కుకోవడంతో పరిస్థితి విషమంగా మారింది. బస్సు కింద నలిగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

**క్షణాల్లో సహాయక చర్యలు :**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసులు, స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ప్రైవేట్ అంబులెన్సులతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు జేసీబీలు, క్రేన్లను రంగంలోకి దించారు. బస్సును పైకి లేపి మృతదేహాలను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం :**

ప్రమాద సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం అంబులెన్సుల ద్వారా హైదరాబాద్‌కు తరలించేలా చర్యలు చేపట్టారు.

**ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్ :**

ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఘటనాస్థలిని సందర్శించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాద బాధితులకు తనవంతు సహాయాన్ని అందించేందుకు బిఆర్ఎస్ నాయకులతో కలిసి చర్యలు చేపట్టారు.

**పరిహారం ప్రకటించాలని డిమాండ్ :**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంపై స్పందిస్తూ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్, కండిషన్‌పై కఠినంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అలాగే ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం కూడా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దిగ్భ్రాంతి :**

విదేశీ పర్యటనలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధితులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలకు వెళ్లిన ప్రయాణికులను విషాదం వెంటాడటంతో కేసారం, చింతకుంట గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో మృతుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి.

# ఓబీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలి





- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి
- కొత్తూరులో కాంగ్రెస్ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం

**కొత్తూరు అక్టోబర్ 03 (ప్రజా జ్యోతి) :** ఈ నెల 4వ తేదీన శంషాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరులో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు సభకు సంబంధించిన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన సాధన కోసం నిర్వహిస్తున్న బహిరంగ సభకు బీసీ సోదరులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి బీసీ వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ, ఐక్యతతో శంషాబాద్ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఎస్సిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్,సర్పంచులు ఉప్పల దయానంద్ గుప్తా,ఎర్రోళ్ల జగన్, బాసు నాయక్,గోవింద్ నాయక్,బోకుల శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు,మండల బీసీ సెల్ అధ్యక్షుడు అరవింద్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి వై.బాబు,కోడిచెర్ల తాండ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాము నాయక్, గూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్,పెంజర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశాల రమేష్,తీగపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మక్తగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు దయ్యాల మల్లేష్,తీగాపూర్ ఆంజనేయులు, శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుర్‌లో హరి యూనివర్సిటీ విద్యార్థుల సేవ స్ఫూర్తి..!

- స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో 100 మంది విద్యార్థుల శ్రమదానం
- ఆకట్టుకున్న సర్పంచ్ శ్రీశైలం సేవ



**నందిగామ, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** నందిగామ మండల పరిధిలోని చేగుర్ గ్రామంలో పరిశుభ్రత దైవత్వం అనే నినాదాన్ని చాటుతూ గ్రామంలో స్వచ్ఛతకు నిలయంగా మారింది. కన్హ శాంతి వనంలోని హరి యూనివెర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత సేవ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి విచ్చేసిన హరి యూనివర్సిటీ ఛాన్సలర్ రిజిస్టర్ మరియు వంద మంది విద్యార్థుల బృందానికి గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం ఘన స్వాగతం పలికారు. అనంతరం అందరూ కలిసి శ్రమదానంలో పాల్గొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ చుట్టూ ఏళ్లుగా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు చెత్తాచెదారాన్ని విద్యార్థులు గ్రామస్తులు కలిసి తొలగించారు. సర్పంచ్ శ్రీశైలం స్వయంగా చేతికి కొడవలి పట్టి పిచ్చి మొక్కలను తొలగించారు, అందరి దృష్టిని ఆకర్షించింది. విద్యార్థులు కేవలం పుస్తకాలకి పరిమితం కాకుండా సమాజసేవలో పాల్గొనడం గొప్ప విషయం, చేగుర్ ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దుతానని ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని సర్పంచ్ శ్రీశైలం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, గ్రామపంచాయతీ పాలక పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ సేవలకు బీజేపీ అభినందన

### రూప్ ఖాన్‌పేట్, బాబాపూర్‌లో సేవా సంపర్క అభియాన్



**పరిగి, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** సేవా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరిగి మండలం రూరల్ అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రూప్ ఖాన్‌పేట్, బాబాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లకు ఘనంగా సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా అనసూయ శ్యాంసుందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలామృతం, గుడ్లు, పాలు, మురుకులు తదితర పౌష్టికాహార పదార్థాలను కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆమె అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహా, బీజేపీ నాయకులు సుధాకర్, శేఖర్, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు : ఎమ్మెల్యే టీఆర్ఆర్



**పరిగి, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి) :** పూడూరు మండలం మాటుగూడెం గ్రామానికి చెందిన మమత తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. ఆర్థికపరమైన సమస్యలు లేదా ఇతర ఇబ్బం దులు ఎదురైతే తనను సంప్రదించాలని, సమస్యలను పరిష్క రించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషాద ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

## మా కాలనీ ప్రజల దాహార్తిని తీర్చండి

- శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ నిర్వాహకుడిని కలిసిన బుడిగా జంగాలు
- సానుకూలంగా స్పందించిన డాక్టర్ సంపత్ కుమార్
- కృతజ్ఞతలు చెప్పిన బుడిగజంగాలు



**తాండూరు అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** మా కాలానికి చెందిన ప్రజల దాహర్టిని తీర్చాలని తాండూరు పట్టణం ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన పలువురు బుడిగజంగాలు డాక్టర్ సంపత్ కుమార్‌ను కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన డాక్టర్ సంపత్ కుమార్ రెండో వార్డ్ బుడగ జంగం కాలనీలో తాగునీటి సమస్యను తీర్చేందుకు బోరును వేయించారని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బుడగ జంగం ప్రజలు మాట్లాడుతూ మా కాలనీలో ఎన్నో రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని బుడిగా జంగం (మోడెం) కృష్ణ అనే వ్యక్తి డాక్టర్ సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.దీంతో బుడగ జంగం కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం తాండూర్ డివిజన్ కార్యదర్శి బుడగజంగం వెంకటేష్, సీనియర్ రిపోర్టర్ లక్ష్మణ్, వార్డు పెద్దలు రమేష్, మోడెం కృష్ణ, మోడం దత్తు, మోడేం రమేష్, రుద్రాక్షల దస్తప్ప, రుద్రాక్షల బాబు,వానరాసి శేఖర్, శాంతి కుమార్,అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు : ఎన్ఎస్ యుఐ

- దనిక్ భారత్, లామెంటరీ కాలేజీలపై తక్షణ చర్యలు తీసుకోవాలి
- బొంగ్లూర్, ఆదిబట్ల ప్రాంతాల్లోని అనుమతులేని కాలేజీలు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు: నందకిషోర్

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 ప్రజాజ్యోతి :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని బొంగ్లూర్, ఆదిబట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న, దనిక్ భారత్ జూనియర్ కాలేజ్, లామెంటరీ జూనియర్ కాలేజ్ల నిర్వహణ, అనుమతులు విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించిన అంశాలపై శనివారం ఎన్ఎస్ యుఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కళాశాలలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా?

ఏ సంస్థకు సంబంధించిన అనుమతులతో విద్యా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను తప్పుదారి పట్టించే విధంగా అనుమతులు లేకుండా లేదా ఇతర కళాశాలల అనుమతులను ఉపయోగించి నిర్వహణ జరుగుతున్నట్లు విచారణలో తేలితే, సంబంధిత కళాశాలలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన అనుమతులు వచ్చే వరకు కళాశాలల నిర్వహణను నిలిపివేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, విద్యాశాఖ అధికారిని కోరినట్లు నందకిషోర్ తెలిపారు.

## ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ వరప్రదాయిని

కరీంనగర్ టౌన్,అక్టోబర్ 3( ప్రజాజ్యోతి ):
ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పలువురు ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్జీవోల సంఘం జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో, చైర్మన్ మారం



జగదీశ్వర్ పర్యవేక్షణలో కరీంనగర్‌లోని సన్‌రైజ్, అపోలో రీచ్, మెడికవర్, స్టార్ ఆసుపత్రులను సందర్శించారు.
ఈ సందర్భంగా ఈ హెచ్ ఎస్ అమలు తీరు, వైద్య సేవలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. హృదయ సంబంధిత చికిత్సలు, మోకాళ్ల మార్పిడి వంటి శస్త్రచికిత్సలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేషెంట్లు తెలిపారు. EHS నిబంధనల ప్రకారం అదనపు మొత్తాలు వసూలు చేయకుండా వైద్యం అందిస్తున్నట్లు ఆసుపత్రుల యాజమాన్యాలు పేర్కొన్నాయి.మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఈ హెచ్ ఎస్ కు సంబంధించిన సమస్యలను నేరుగా జేఏసీ దృష్టికి తీసుకు రావాలని, సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని ప్రచారాన్ని నమ్మవద్దని ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందేలా జేఏసీ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, జిల్లా వైద్యధికారి డాక్టర్ రాజ్‌గోపాల్‌రావు, ఈ హెచ్ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజు, మాడిపెల్లి కాళీచరణ్‌గౌడ్, వివిధ ఆసుపత్రుల వైద్యులు, ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ టేకు కలప పట్టివేత

### రూ.35 వేల విలువైన 20 టేకు దుంగలు స్వాధీనం

మల్లాపూర్,అక్టోబర్ 3 ప్రజాజ్యోతి:
మండలంలోని కొత్త ధాంరాజ్ పల్లి గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు




మల్లాపూర్ అటవీ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మల్లాపూర్ అటవీ శాఖ సెక్షన్ అధికారి బి. గంగారాం సమక్షంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.35 వేల విలువైన 20 టేకు కలప దుంగలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్రమంగా కలపను నిల్వ ఉంచిన వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించిన అనంతరం అటవీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అక్రమంగా టేకు చెట్లను నరికివేయడం, కలపను నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. అటవీ నేరాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## కండ్లపెల్లిలో గౌడ సంఘం సభ్యులకు 'కాటమయ్య రక్షణ కిట్లు' పంపిణీ

బీర్ పూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):
బీర్ పూర్ మండలం పరిధిలోని కండ్లపెల్లి గ్రామంలో గౌడ సంఘం సభ్యులకు ఎక్సైజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'కాటమయ్య రక్షణ కిట్లను'





పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు కిట్ల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి దినేష్ కుమార్ మాట్లాడుతూ.. తాటి చెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి చాలా మంది గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాల నివారణకు, కార్మికుల ప్రాణ రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో ఈ కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తోందని ఆయన తెలిపారు. అర్హులైన గౌడ సంఘం సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, చెట్లు ఎక్కే సమయంలో తప్పనిసరిగా రక్షణ కిట్లను ఉపయోగించాలని కోరారు.
అనంతరం ఎక్సైజ్ ఎస్సై మనీషా రాథోడ్, ట్రైనర్లు మాట్లాడుతూ.. ఈ కిట్లు గీత కార్మికులకు భద్రతను ఇవ్వడమే కాకుండా, శ్రమను కూడా తగ్గిస్తాయని వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బందితో పాటు ట్రైనర్లు అంజి గౌడ్, పోనం వెంకటేష్ గౌడ్, ఈలందు అంజిబాబు, అశోక్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే గౌడ సంఘం అధ్యక్షులు గంగదరి శంకర్ గౌడ్, పర్వతం శంకర్ గౌడ్, ఉపసర్పంచ్ ఎనగంటి రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గంగదరి పూర్ణచందర్ గౌడ్, గంగదరి సతీష్ గౌడ్, పర్వతం లచ్చన్న గౌడ్, పర్వతం సత్యనారాయణ గౌడ్, పొరుగింటి వెంకటేష్ గౌడ్, గంగదరి మల్లయ్య గౌడ్, సంతోష్ గౌడ్, ఇతర నాయకులు, గౌడ సంఘం సభ్యులు మరియు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికే ఆదర్శంగా 'గ్రీన్ కరీంనగర్'

### పర్యావరణ పరిరక్షణలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి ):
పచ్చదనం పెంపు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ట్రాన్స్‌జెండర్ల ఆధ్వర్యంలో 'గ్రీన్ కరీంనగర్' కార్యక్రమాన్ని చేపట్టడం అభినం




దనీయమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ట్రాన్స్‌జెండర్లు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుని తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'గ్రీన్ కరీంనగర్' కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ట్రాంజెండర్స్ అసోసియేషన్ అడ్వైజర్ ఈవీ శ్రీనివాసరావు నేతృత్వంలో, జిల్లా అధ్యక్షురాలు ఆశ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందిన ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తింపు కార్డులను అందజేశారు.

**సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి..**

కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లలో చాలామంది విద్యావంతులు, వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగినవారు ఉన్నారని తెలిపారు. తమ ప్రతిభకు తగిన అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు.

**'గ్రీన్ కరీంనగర్'కు శాఖల సహకారం:**

ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'గ్రీన్ కరీంనగర్' కార్యక్రమాన్ని నిర్వహించాలనే నిర్ణయం మంచి పరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పచ్చదనం పెంపు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ట్రాన్స్‌జెండర్లు వాలంటీర్లుగా పనిచేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్, అటవీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అందుబాటులోకి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రాంజెండర్స్ అసోసియేషన్ అడ్వైజర్ ఈవీ శ్రీనివాసరావు, ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షురాలు ఆశ, ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధులు సింధు, రోహణ, వైష్ణవి, పూజ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దౌర్జన్యం!

**ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి అంటూ విద్యార్థులపై ఒత్తిడి?**

**బకాయిలు ఉంటే పిల్లలను స్కూల్‌కు పంపొద్దంటూ తల్లిదండ్రులకు హెచ్చరికలంటూ ఆరోపణలు**

**పిల్లలతో చెలగాటం.. తల్లిదండ్రులపై ఫీజుల భారం**

**కార్పొరేట్ స్కూళ్ల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం.. విద్యాశాఖ అధికారుల మౌనంపై ప్రశ్నలు**

కోరుట్ల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):
కోరుట్ల పట్టణంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల వ్యవహారం విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చదువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి.ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని, బకాయిలు ఉన్న విద్యార్థులను పరీక్షలకు దూరంగా ఉంచుతామని కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఫీజులు చెల్లించని విద్యార్థులను పాఠశాలకు పంపవద్దంటూ తల్లిదండ్రులకు సూచిస్తున్నారనే




ఆరోపణలు కూడా ఉన్నాయి.

**– ఫీజులు కట్టకపోతే పరీక్షలకు నో ఎంట్రీ?**

పరీక్షల సమయం కావడంతో ఫీజుల అంశం మరింత తీవ్రంగా మారిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఫీజులు బకాయి ఉన్న విద్యార్థులకు పరీక్షలకు అనుమతి ఉండదని చెప్పడం వల్ల పిల్లల్లో ఆందోళన నెలకొంటోందని వారు పేర్కొంటున్నారు.విద్యార్థుల ప్రతిభను అంచనా వేయాల్సిన పరీక్షలను ఫీజుల చెల్లింపుతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**– పిల్లలతో చెలగాటం.. తల్లిదండ్రులపై ఫీజుల భారం?**

పాఠశాల ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, రవాణా, ఇతర విద్యా ఖర్చులు భరిస్తున్న కుటుంబాలపై అదనపు ఫీజుల ఒత్తిడి తీవ్ర భారంగా మారుతోందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఫీజులు ఆలస్యమైన సందర్భాల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా, తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

**– విద్యార్థుల ముందు ఫీజుల ప్రస్తావన వద్దు:**

ఫీజుల బకాయిల విషయాన్ని విద్యార్థుల ముందు పదేపదే ప్రస్తావించడం, ఇతర విద్యార్థుల ముందు ఇబ్బందులకు గురిచేయడం వల్ల పిల్లలపై మానసిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిల్లలు చదువుకోవడానికి స్కూల్‌కు వెళ్తున్నారు.. కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆందోళన చెందడానికి కాదు అని వారు పేర్కొంటున్నారు.

**– కార్పొరేట్ వ్యవస్థపై విద్యాశాఖకు పట్టింపు లేదా?:**

కోరుట్ల పట్టణంలో కార్పొరేట్ పాఠశాలలు నిర్వహిస్తున్న తీరుపై తల్లిదండ్రులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఫీజుల వసూళ్లు, విద్యార్థులపై ఒత్తిడి, పరీక్షలకు అనుమతి వంటి అంశాలపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.కార్పొరేట్ పాఠశాలల వ్యవస్థ ఎక్కడి నుంచి నడుస్తోంది? విద్యార్థులు, తల్లిదండ్రులపై జరుగుతున్న ఫీజుల ఒత్తిడిని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**– అధికారుల తనిఖీలు ఎక్కడ?:**

పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల విధానం, విద్యార్థులపై ఒత్తిడి, పరీక్షలకు అనుమతి వంటి అంశాలపై విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణల్లో వాస్తవం ఎంత? పాఠశాలలు నిబంధనలను పాటిస్తున్నాయా? విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడికి గురిచేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

**– ఫీజుల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు:**

ఫీజుల సమస్య తల్లిదండ్రులు–యాజమాన్యాల మధ్య ఆర్థిక అంశంగా పరిష్కరించుకోవాల్సిందే తప్ప, దాని ప్రభావం విద్యార్థుల తరగతులు, పరీక్షలు, చదువుపై పడకూడదని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు విడతలవారీగా ఫీజులు చెల్లించే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

**– విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలి:**

కోరుట్లలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలను విద్యాశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవం కాదంటే పాఠశాలల నుంచి స్పష్టత తీసుకుని తల్లిదండ్రులకు తెలియజేయాలని వారు కోరుతున్నారు.

**– పిల్లల భవిష్యత్తుతో చెలగాటం వద్దు..**
**ఫీజుల వసూళ్లపై విద్యాశాఖ నిఘా పెట్టాలి**

ఇప్పటికైనా కోరుట్ల విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల తీరుపై సమగ్రంగా విచారణ చేపట్టాలని, విద్యార్థులను ఎలాంటి ఒత్తిడికి గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**విద్యార్థులను ఫీజుల కోసం వేధించడం సరికాదు: అజార్ భాయ్**



కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన నాయకుడు అజార్ భాయ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులను పరీక్షలకు దూరం చేయడం, పిల్లలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఫీజుల వసూళ్లపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### బస్ డిపో, బైపాస్, రైల్వే ఫ్లైఓవర్ పనులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి:
జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత



గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం అప్పన్నపేట, రాఘవపూర్, పెద్దపల్లి, కూనారం ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్పన్నపేటలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని, భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాఘవపూర్‌లో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, అప్రోచ్ రోడ్డుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, విద్యుత్



స్తంభాల మార్పిడి, వైరింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.
అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయంతో ముందుకు సాగాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటనలో ఆర్డీఓ బి. గంగయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్ పెద్దపల్లి జిల్లా కార్యవర్గం ఏర్పాటు

### అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి, ..ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్

పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 3 ప్రజా జ్యోతి ;
: పీఆర్‌టీయూ టీఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి రంగంపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్‌లో జిల్లా శాఖ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. మొత్తం నాలుగు ప్యానెళ్లు పోటీ పడగా అధ్యక్ష పదవికి గండు కృష్ణమూర్తికి 55 ఓట్లు, ప్రధాన




కార్యదర్శి పదవికి కానుగంటి శ్రీనివాస్‌కు 49 ఓట్లు లభించాయి. దీంతో వారి ప్యానెల్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన 20 మంది జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, బి. ఆనంద్ రావులు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాగినేడు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ సోమ కుమార్

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి: రాగినేడు గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు



చేయాలని కోరుతూ సర్పంచ్ సోమ కుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు పెద్దపల్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మంజూరైన పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, అప్పన్నపేట–రాగినేడు ప్రధాన రహదారిని విస్తరించి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామంలో కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 301లోని భూమిని గ్రామపంచాయతీకి లేదా నిరుపేద కుటుంబాలకు సాగు కోసం కేటాయించాలని కోరారు. అలాగే మహిళా సంఘాల భవనం, కమ్యూనిటీ హాల్, ఎస్సీ కాలనీకి నీటి ట్యాంకు, ముత్యాలకుంట చెరువుకు ఎస్సారెస్పీ కాలువ లైనింగ్, అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

### రూ.28,120 నగదు, 7 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి: పెద్దపల్లి పట్టణంలోని భూమ్‌నగర్‌లో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్, పెద్దపల్లి టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి



చేసి అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 ప్లేయింగ్ కార్డులు, రూ.28,120 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్‌ఐ దీకొండ రమేష్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పెద్దపల్లి టౌన్ పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై డీఎంహెచ్ఓ రామారావు సమీక్ష




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు శనివారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య పరీక్షల నిర్వహణ, ప్రయోగశాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సంయుక్త సంచాలకురాలిని కలిసి ఆసుపత్రిలోని వైద్య సేవలు,నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఖమ్మం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో పర్యవేక్షకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయి పర్యవేక్షణ,ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేలా అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ రామారావు సూచించారు.

# ప్రభాకర్ పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

★ ప్రాణ స్నేహితుడినే ప్రాణం తీసేందుకు యత్నించిన స్నేహితుడు
★ రూ.30 లక్షల కోసం స్నేహితుడికే సుపారీ



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 3,(ప్రజా జ్యోతి)** అతి స్నేహం అసలకే మోసం వస్తుందనే అన్న మాటను ఒక స్నేహితుడు పాల్వంచ లో నిజం చేశాడు, గత కొన్ని సంవత్సరాలుగా పాల్వంచలో ప్రాణ స్నేహితులుగా ఉండే ఇరువురు మధ్య ఆర్థిక లావాదేవీలు ఏర్పడడంతో గత నెల ఏడవ తేదీన ప్రభాకర్ అనే వ్యక్తిపై తోటి ప్రాణ స్నేహితుడే హత్యకు ప్రయత్నం చేశాడు, దీంతో ప్రభాకర్ పాల్వంచ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ ప్రారంభించారు ఈ కేసులో ప్రభాకర్ పై దాడి చేసిన నిందితులను శనివారం పాల్వంచ పోలీసులు అరెస్టు చేసి నిందితులను విలేకరుల ఎదుట హాజరపరిచి పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ వివరాలను వెల్లడించారు, వివరాల్లోకి వెళ్తే పాల్వంచలో జర్నలిస్ట్, బీజేపీ జిల్లా నాయకుడు మానుపూరి ప్రభాకర్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రభాకర్‌కు అత్యంత సన్నిహితుడైన కేటీపీఎస్ ఉద్యోగి పాల నాగేశ్వరరావే ప్రధాన సూత్రధారి అని గుర్తించామన్నారు, గత నెలలో పాల్వంచలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ప్రభాకర్‌పై ముగ్గురు వ్యక్తులు మారణాయుధాలు, సోడా సీసాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ,తీవ్ర గాయాలతో ప్రభాకర్ ప్రాణాపాయం నుంచి బయటపడగా, వెంటనే పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు, ప్రభాకరపై జరిగిన దాడి వెనుక పెద్ద కుట్ర ఉందని పేర్కొంటూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామన్నారు, ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన తాము సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సేకరించి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు, విచారణలో గోవా క్యాసినోలలో పెట్టుబడుల పేరుతో పాల నాగేశ్వరరావు, ప్రభాకర్ వద్ద నుంచి రూ.30 లక్షలు తీసుకున్నట్లు గుర్తించారు. అనంతరం డబ్బు తిరిగి ఇవ్వాలని ప్రభాకర్ ఒత్తిడి చేయడంతో, బాకీ నుంచి తప్పించుకునేందుకు అతడిని హత్య చేయాలని నాగేశ్వరరావు కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెంకు చెందిన దాసరి రాజుతో కలిసి రూ.5 లక్షలకు సుపారీ ఒప్పందం కుదుర్చుకొని హత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో తేలింద అన్నారు ,ఘటన అనంతరం నాగేశ్వరరావు పరారీలోకి వెళ్లడం కూడా పోలీసుల అనుమానాలకు దారి తీసినట్లు అయింది, ఇదిలా ఉండగా, గోవా క్యాసినోలలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి నాగేశ్వరరావు పలువురి నుంచి సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిసిందన్నారు, ఈ ఆర్థిక లావాదేవీలు, మోసాలపై కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పాల నాగేశ్వరరావుతో పాటు సుపారీ గ్యాంగ్ సభ్యులు దాసరి రాజు, వినయ్, గని, శివలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు, ఈ విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్ఐ నాగరాజు, సాయి కిషోర్ ,హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణులు ఉన్నారు

# కరకట్ట రక్షణకు చర్యలు చేపట్టాలి: ఇరప రాజు డిమాండ్



**చర్ల, అక్టోబర్ 03:(ప్రజా జ్యోతి):** గోదావరి వరదలు, సీతారామ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ముంపు ప్రభావం నుంచి చర్ల మండల ప్రజలను రక్షించేందుకు నిర్మించిన గోదావరి కరకట్టను ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలు, కాంట్రాక్టర్ల కార్యకలాపాల వల్ల బలహీనపడకుండా తెలంగాణ ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కరకట్ట నిర్మాణం ప్రధాన ఉద్దేశం గోదావరి వరదలు, సీతారామ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ప్రభావంతో చర్ల మండలంలోని గ్రామాలు, ప్రజలు, వ్యవసాయ భూములకు ముంపు ముప్పు ఏర్పడకుండా రక్షణ కల్పించడమేనన్నారు. అయితే కరకట్ట పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలు, ఇతర కార్యకలాపాల వల్ల కరకట్టకు నష్టం వాటిల్లకుండా అధికారులు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. కరకట్ట బలహీనపడితే భవిష్యత్‌లో వరదలు, బ్యాక్‌వాటర్ ముంపు సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులు, పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. కాంట్రాక్టర్ల ఆర్థిక ప్రయోజనాల కంటే ప్రజల భద్రత, గ్రామాల రక్షణ, వ్యవసాయ భూములు, ప్రభుత్వ ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కరకట్ట బలహీనపడే విధంగా భారీ వాహనాల రాకపోకలు జరుగుతున్నాయా అనే అంశంపై ఇరిగేషన్ శాఖ సాంకేతిక పరిశీలన నిర్వహించాలని, సీతారామ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కరకట్ట పటిష్టతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరకట్ట పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, రవాణా కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కరకట్ట రక్షణకు ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో చర్ల మండల ప్రజలకు ముంపు, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని ఇరప. రాజు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, గ్రామాల భద్రత కంటే ఏ కాంట్రాక్టు కార్యకలాపాలు ముఖ్యమైనవి కావని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. కరకట్ట రక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రజా ప్రయోజనాల కోసం ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాటి భూపతిదొర, సోడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి దీవెనలే అందరికీ శ్రీరామరక్ష

★ డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 3 ,(ప్రజా జ్యోతి)** అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలే అందరికీ శ్రీరామరక్ష అని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని 1 వ డివిజన్ బొల్లోరిగూడెంలో జరిగిన టీం ఆదిశక్తి దుర్గామాత నవరాత్రుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నవరాత్రులకు పనులు ప్రారంభించేందుకు కొత్వాల భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల



మాదిరిగానే దసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు,ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు సీరపు సుగుణ, మాలంపాటి భవిత, కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, మహిపతి రామలింగం, కొండం వెంకన్న గౌడ్, సాదం రామకృష్ణారావు, వై. వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, బాడిశ శంకర్ రావు, మాలంపాటి కిరణ్, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ కరెంటు కష్టాలు రానివ్వం

★ యూనిట్ కు రూ.12 పెట్టి కొనేందుకైనా సిద్ధంగా ఉన్నాం
★ ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టి
★ గత పాలకుల మాదిరి మాది దొరల ప్రభుత్వం కాదు.. పేదోడి ప్రజా ప్రభుత్వం
★ మొదటి విడతలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేశాం
★ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
★ నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో పాలేరు వాగుపై చెక్ డ్యామ్ ప్రారంభోత్సవం
★ 31 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌ల పంపిణీ







**నేలకొండపల్లి, అక్టోబర్ 3 ప్రజా జ్యోతి:** దేశవ్యాప్తంగా, ప్రధానంగా మన తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. ప్రజలకు కరెంట్ కష్టాలు రానివ్వకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో రూ. 6.65 కోట్లతో పాలేరు వాగు పై





నిర్మించిన చెక్ డ్యామ్ ను, వట్టుకుంట వాగు వరకు రూ. 2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ దివాకర.టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన ఈ చెక్ డ్యామ్ ద్వారా.. నేలకొండపల్లి మండలం తో పాటు, సమీప కోదాడ మండలానికి కూడా సాగునీరు అందుతుందని తెలిపారు.

**సాగు, తాగునీటి కొరత రానీయకుండా చూశాం..**

ఎల్ నినో ప్రభావం తాండవిస్తున్నా... తాగు, సాగునీటి కొరత పరిస్థితులు రానీయకుండా చూసామని అన్నారు. ఇటీవలి తుఫానుతో కొంత మేలు జరిగిందని తెలిపారు. విద్యుత్ కొరత రానీయకుండా.. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి యూనిట్ కు రూ.12 చొప్పున కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అలాగే ప్రత్యామ్నాయంగా.. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ కొరత పరిష్కారంపై.. ఇటీవలి కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు.

**గతంలో దొరల ప్రభుత్వం.. మాది పేదోడి ప్రజా ప్రభుత్వం**

గత పాలకులు దొరల ప్రభుత్వాన్ని నడిపించారని, తమది పేదోడి పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. సన్న బియ్యం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను పేదోడి గడప వరకు చేర్చామని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల చిరకాల కల అయిన సొంతింటిని ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సాధ్యం చేశామని తెలిపారు. మొదటి విడతలో 2.25 లక్షల ఇళ్లు పూర్తి చేశామని, రెండో విడత కూడా కేటాయించామని, ఒక హైదరాబాద్ లోనే లక్ష ఇళ్లు కేటాయించామని స్పష్టం చేశారు. గత పాలకుల మాదిరిగా.. తమది దొరల ప్రభుత్వం కాదని, పేదోడి పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వమని, అన్ని వర్గాల ప్రజలకు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, బచ్చలికూర నాగరాజు, సర్పంచ్ సైదులు, పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, గోబ్రియా నాయక్ ,కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డల సంక్షేమమే అంగన్వాడీల నిలయం: ఐసిడిఎస్ పిడి ప్రమీల

★ చింతకానిలో ఘనంగా పోషణ మాసోత్సవ ఉత్సవాలు ★ పలువురికి శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు,అన్నప్రాసన
★ కార్యక్రమాలను అభినందించిన ఐసిడిఎస్ పిడి ప్రమీల



**చింతకాని అక్టోబర్ 03(ప్రజా జ్యోతి)** పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా రక్తహీనత సమస్యలు లేకుండా గర్భిణీలు సుఖ ప్రసవం అవుతారని ఐసిడిఎస్ జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల అన్నారు. ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ సిడిపిఓ చావా కమల ప్రియ ఆధ్వర్యంలో చింతకాని మండల పరిధిలోనీ లచ్చగూడెం రైతు వేదికలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో ప్రమీల మాట్లాడుతూ తల్లి, బిడ్డల సంక్షేమం లక్ష్యంగా



అంగన్వాడి కేంద్రాల,ద్వారా అందించే సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోషకాహార లోపం వలన పలు అనారోగ్య సమస్యలు వస్తాయని, అందువల్ల గర్భిణీ గా గుర్తించిన దగ్గర్నుంచి అంగన్వాడి కేంద్రంలో పేరు నమోదు చేసుకొని,ప్రభుత్వం అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుని, అంగన్వాడి టీచర్లు ఇచ్చే సలహాలు,సూచనలు,పాటిస్తూ ఆరోగ్యశాఖ సహకారంతో అందించే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గర్భిణీ మొదలైన దగ్గర్నుంచి బిడ్డకు 2 సంవత్సరాల వయసు వచ్చేవరకు మధ్య 1000 రోజుల సమయాన్ని బంగారు రోజులుగా అభివర్ణించారు. పుట్టిన బిడ్డ 2 సంవత్సరాల వరకు ఎదుగుదల వేగంగా ఉంటుందని శారీరకంగా, మానసికంగా చాలా పరిణితి చెందుతారని,అందువల్ల ఈ మధ్య కాలాన్ని బంగారు రోజులుగా పరిగణిస్తామన్నారు. సి.డి.పి.ఓ కమల ప్రియ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలంటే ఆర్థిక భారం అవకుండా అంగన్వాడి టీచర్లు స్వయంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు శుభ్రముగా, రుచికరముగా తయారు చేసి ప్రదర్శించి,అవగాహన కల్పిస్తున్నారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తహసిల్దార్ కరుణ శ్రీ, మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ,చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. చిన్నారులకు ఆటపాటలతో క్రమ శిక్షణ కలిగిన విద్యాబోధన అందిస్తూ, బాల్యారంబ దశను బంగారు బాటలో నడిపిస్తున్నారని అన్నారు. ఆర్.బి.ఎస్.కె జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, పి హెచ్ సి వైద్యులు డాక్టర్ వివి రావు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ఐసిడిఎస్ సమన్వయంతో తల్లి బిడ్డల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునికరించిన వైద్య సదుపాయాలు ఉన్నాయని, గర్భిణీలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా గవర్నమెంట్ ఆసుపత్రులలో డెలివరీ అవ్వాలని కోరారు. లచ్చగూడెం సర్పంచ్ కొప్పుల రజిని, వందనం గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు లు మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి గర్భిణీలు బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ, చిన్నారులకు చక్కటి విద్యాబోధన అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని , ఆటోలు వ్యానుల ద్వారా పిల్లలను దూర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలకు పంపకుండా, స్థానికంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు



సూచన చేశారు. ఐసిపిఎస్ జిల్లా కోఆర్డినేటర్ తమిన్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలని అన్నారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర సారె, పూలు ,పండ్లు చలిమిడి బొట్టు గాజులతో వడి నింపి కుటుంబ సభ్యుల సమక్షంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఐసిడిఎస్ పిడి ప్రమీల ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి, నాగులవంచ సెక్టార్ సూపర్వైజర్ సత్యవతి,పోషణ అభియాన్ బాధ్యులు కొమ్మినేని బాబు, షామిలి , టీచర్లు,తల్లులు, ఆయాలు పాల్గొన్నారు.

# పాల్వంచలో నకిలీ పెన్షన్లపై సమగ్ర విచారణ జరపాలి

★ అర్హత లేని వారికి దివ్యాంగ, వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నారంటూ బీజేపీ ఫిర్యాదు



**పాల్వంచ, అక్టోబర్ 03(ప్రజా జ్యోతి)** పట్టణంలోని 27 డివిజన్లలో అర్హత లేని వ్యక్తులు దివ్యాంగుల, వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం సమర్పించారు. పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాల్వంచలో దివ్యాంగుల పెన్షన్ల మంజూరు, పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అర్హత లేని కొందరికి తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా దివ్యాంగుల పెన్షన్లు మంజూరైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరం శిబిరాల్లో కొందరు వైద్య అధికారులు డబ్బులు తీసుకుని వైకల్యం లేని వారికి సైతం ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరపాలని కోరారు. అదేవిధంగా వృద్ధాప్య పెన్షన్ల అర్హతలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కేటీపీఎస్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న కొందరు వ్యక్తులు వృద్ధాప్య పెన్షన్లు కూడా పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అలాంటి వారి అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అనర్హులుగా తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం దివ్యాంగుల పెన్షన్ కింద నెలకు రూ.3,016, వృద్ధాప్య పెన్షన్ కింద రూ.2,016 అందుతున్న నేపథ్యంలో.. అర్హత లేని వ్యక్తులకు ప్రభుత్వ నిధులు అందుతున్నాయా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలనకు డిమాండ్..**

పాల్వంచలోని మొత్తం 27 డివిజన్లలో పెన్షన్ లబ్ధిదారుల అర్హతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని బీజేపీ నాయకులు కోరారు. అనుమానాస్పదంగా ఉన్న దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను ప్రత్యేక వైద్య బృందాలతో పునఃపరిశీలించాలని, అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనర్హులకు చెల్లించిన నిధుల విషయంలోనూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, నిజమైన దివ్యాంగులు, వృద్ధులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలోత్ ప్రశాంత్ నాయక్, కొత్తపల్లి విజయ, శాంపురి నాగేంద్రబాబు, వాంకుడోత్ హాథిరామ్, సంకినేని రుద్ర, అజ్మీరా హాథిరామ్, కోరదల రమేష్, శాంపురి పవన్, పండు తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డు లో విషాదం

- నాలుగు నిండు ప్రాణాలు బలి
- అదుపుతప్పి బోల్తాపడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 40 మందికి గాయాలు
- అంత్యక్రియలకు వెళ్తుండగా ఘోరం
- ఘటనాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- క్షతగాత్రులకు తక్షణ వైద్యం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి): అంత్యక్రియలకు వెళ్తున్న వారిని మృత్యువు వెంటాడింది. అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. అదుపుతప్పిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడటంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసారం గ్రామానికి చెందిన వారు వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం చింతకుంట గ్రామంలో నివసిస్తున్న బంధువు అంత్యక్రియలకు బస్సులో బయలుదేరారు. అనంతగిరి ఘాట్ రోడ్డులో దిగుతున్న సమయంలో బస్సు అదుపుతప్పి మలుపు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కొందరు బస్సు కింద చిక్కుకోవడంతో పరిస్థితి విషమంగా మారింది. బస్సు కింద నలిగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

**క్షణాల్లో సహాయక చర్యలు:**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసులు, స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ప్రైవేట్ అంబులెన్సులతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు జేసీబీలు, క్రేన్లను రంగంలోకి దించారు. బస్సును పైకి లేపి మృతదేహాలను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం



కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం:**

ప్రమాద సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం అంబులెన్సుల ద్వారా హైదరాబాద్‌కు తరలించేలా చర్యలు చేపట్టారు.

**ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్:**

ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఘటనాస్థలిని సందర్శించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాద బాధితులకు తనవంతు సహాయాన్ని అందించేందుకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి చర్యలు చేపట్టారు.

**పరిహారం ప్రకటించాలని డిమాండ్:**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంపై స్పందిస్తూ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్, కండిషన్‌పై కఠినంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అలాగే ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం కూడా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దిగ్భ్రాంతి:**

విదేశీ పర్యటనలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ





స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలకు వెళ్లిన ప్రయాణికులను విషాదం వెంటాడటంతో కేసారం, చింతకుంట గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో మృతుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి.

## ఇనుపరాడ్‌తో దాడి.. వృద్ధురాలి హత్య..

### నిందితుడి అరెస్ట్..

పరకాల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి): పరకాల పట్టణంలోని ఆకులవాడలో వృద్ధ మహిళపై దాడి చేసి హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు బంగారు పుస్తెలు, హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనపై పరకాల పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 291/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 103(1), 109(1), 329(4) ప్రకారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ ఏ.




ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం వెల్లంపల్లి రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన రాంనగర్‌కు చెందిన నేరెళ్ల రమేష్ (38)ను అదుపులోకి తీసుకుని విచారించారు. సెప్టెంబర్ 30 అర్ధరాత్రి ఆకులవాడలో వృద్ధ మహిళలు నివసిస్తున్న ఇంట్లోకి పైకప్పు ద్వారా ప్రవేశించి, వారు కేకలు వేయడంతో ఇనుపరాడ్‌తో దాడి చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కోడెల సుగుణ మృతి చెందగా, కోడెల లసుమక్క తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం రెండు బంగారు పుస్తెలు, రూ.1,000 నగదును తీసుకుని పరారైనట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రెండు గ్రాముల బంగారు పుస్తెలు, ఇనుపరాడ్‌తో పాటు రక్తపు మరకలున్న ఆకుపచ్చ షర్టు, నీలం జీన్స్ ప్యాంట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు పవన్, రఘుపతిని ఏసీపీ అభినందించారు. వారికి పోలీస్ కమిషనర్ ద్వారా రివార్డు అందించనున్నట్లు తెలిపారు.

### 22-ఏ సమస్యల పరిష్కారంలో

## మరో కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి..

మరియు ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు. ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేయాలని అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వానికి అమలు పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి తమ సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం వల్ల ఉపశమనం లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. శనివారం నాడు రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి గారు మాట్లాడుతూ 22ఎ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యే విధంగా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని అమలు చేయాల్సిన కనీస బాధ్యత అధికారులపై ఉందని ఆ బాధ్యతను అధికారులు సరైన విధంగా నిర్వర్తిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అన్నారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆదేశించారు. గత నెల 16వ తేదీన శాసనసభ వేదికగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 22ఎ తో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శాసనసభ లో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశాం. ఆ తర్వాత జి.ఓ 118 మరియు జి.ఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలను జారీ చేశాం. 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశాం. ఆ క్రమంలోనే తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ మెమో జారీ చేశామని వెల్లడించారు.

### మహిళలు, పిల్లల రక్షణకు

## ప్రభుత్వం ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి..

జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం' అనే అంశంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి,జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయ సేవల సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని వివరించారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు



చేసినట్లు సీఎం తెలిపారు. పోలీసు శాఖ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో షీ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని, సైబర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని సీఎం తెలిపారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సైబర్ నేరాల నివారణలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. పిల్లలను తప్పుపట్టకుండా స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహనతో మార్గనిర్దేశం చేయాలని కోరారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే స్పందించేందుకు 1930 నంబర్‌ను, పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను గుర్తుంచుకోవాలని సీఎం సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష విధించడం మాత్రమే కాదని, బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, గౌరవాన్ని పునరుద్ధరించడం కూడా న్యాయంలో భాగమేనన్నారు. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని పేర్కొన్నారు. సదస్సులో చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల సైబర్ భద్రతకు మార్గదర్శకంగా నిలుస్తాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను కేంద్ర మంత్రి, న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## మానసిక స్థైర్యం, స్త్రీ సాధి కారతే 'బియాండ్ ది హొరై జన్' లక్ష్యం

- కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- మహిళలు ఎందులోనూ తక్కువ కాదు
- మూస ధోరణులు మారాలి
- మానసిక ఆరోగ్య ప్రచార కర్త సెహర్ హష్మీ

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 3,(ప్రజా జ్యోతి): మానసిక ఆరోగ్యం పై అవ గాహన కల్పించడంతోపాటు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే 'బియాం డ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచా ర యాత్ర ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలి పారు. జీవితంలో ఎదుర య్యే ఒడిదుడుకులు, కష్టా లు, మానసిక కుంగుబాటు ను ధైర్యంగా ఎదుర్కొని ముం దుకు సాగాలని సూ చించారు.శనివారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో 'బియాండ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీ య ప్రచార యాత్రపై జిల్లా క లెక్టర్ రాజర్షి షా, మానసిక ఆరోగ్య ప్రచారకర్త





సెహర్ హష్మీతో కలిసి మీడియా స మావేశం నిర్వహించారు. యాత్ర ఉద్దేశాలు, ఇప్పటి వరకు నిర్వహించిన కార్య క్రమాలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం ఎంతో కీ లకమైన అంశమన్నారు. భ విష్యత్తు గురించి అతిగా ఆందోళన చెందకుండా, ప్ర స్తుతం ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ జీవితా న్ని సానుకూల దృక్పథంతో కొనసాగించాలని సూచిం చారు. విద్యార్థులు చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితం లో ఎదురయ్యే ఒత్తిడిని అ ధిగమించేందుకు మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో బాలురు, బాలికల మధ్య ఎలాంటి వివక్ష, అసమాన తలు ఉండకూడదని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ స మానమే అనే భావనతో ముందుకు సాగాలని సూ చించారు. ఎవరైనా ఏదైనా విషయంలో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయి నప్పుడు వారిని చులకనగా చూడకుండా ప్రోత్సహించా ల్సిన బాధ్యత కుటుంబ స భ్యులు, మిత్రులు, సమాజంపై ఉందన్నారు. ఎవరైనా మానసికంగా కుంగుబాటు కు గురైనట్లు అనిపిస్తే సమ స్యను ఒంటరిగా ఎదుర్కోవ ద్దని సూచించారు. కుటుంబ సభ్యులు, మిత్రులు లేదా వై ద్య నిపుణులతో మాట్లాడ టం ద్వారా సమస్యకు పరి ష్కారం కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మా నసిక ఆరోగ్యంపై ఉన్న అపో హలను తొలగించి, అవసర మైనప్పుడు సహాయం కోరే లా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంద న్నారు.బియాండ్ ది హొరై జన్' ప్రచార యాత్రలో భా గంగా ఆదిలాబాద్‌లోని ప్ర భుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో విద్యార్థు లకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు మంచి స్పం దన లభించిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా బాలి కలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. మా నసిక ఆరోగ్యంపై పట్టణ ప్రాంతాలతో పాటు మారు మూల ప్రాంతాల్లోనూ విస్తృ త అవగాహన కల్పించాల్సి న అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చైత న్యం తీసుకురావడంలో ప్రిం ట్, ఎలక్ట్రానిక్ మీడియా కీ లకపాత్ర పోషించాలని మీడియా ప్రతినిధులను కోరా రు.మానసిక ఆరోగ్య ప్రచా రకర్త సెహర్ హష్మీ మాట్లా డుతూ తాను ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే పెద్దయ్యాక రాయల్ ఎన్ ఫీ ల్డ్ బైక్ నడపాలనే కల ఉం డేదన్నారు. అయితే అనారో గ్య సమస్యల కారణంగా కొంతకాలం ఆ కలను నెరవేర్చుకోలేకపోయానని తెలి పారు. 2021లో బైక్ నడప డం నేర్చుకున్నానని, 202 4 లో సొంతంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసినట్లు వివరించారు. 2025 లో తొలి ప్రచార యాత్రను నిర్వహించానని, ప్రస్తుతం రెండో 'బియాండ్ ది హొరై జన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' ప్రచార యాత్రను కొన సాగిస్తున్నట్లు తెలిపారు.బైక్ యాత్ర ద్వారా మానసిక ఆ రోగ్యంపై అవగాహన కల్పిం చడంతోపాటు మహిళల సా మర్థ్యంపై సమాజంలో ఉన్న మూస ధోరణులను మార్చా లనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మహిళలు ఏ విషయం లో నూ పురుషుల కంటే తక్కు వ కాదని, వారికి అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా త మ ప్రతిభను చాటుకోగలర ని సెహర్ హష్మీ అన్నారు. మహిళలు బైక్ నడపడం, సాహస యాత్రలు చేయడం వంటి అంశాలపై సమాజం లో ఉన్న సంప్రదాయ అభిప్రాయాలు, మూస ధోరణు లు మారాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొం దించడంతోపాటు, తమ లక్ష్యాలను సాధించేందుకు వా రిని ప్రోత్సహించడమే యా త్ర ఉద్దేశమని వివరించారు.

అనంతరం మానసిక ఆరో గ్యం పై రూపొందించిన అవ గాహన పోస్టర్‌ను జిల్లా కలె క్టర్ రాజర్షి షా ఆవిష్కరించా రు. అంతకుముందు ప్రభు త్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో నిర్వహిం చిన కార్యక్రమంలో కలెక్టర్, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ ముఖ్య అతి థులుగా పాల్గొని విద్యార్థు లకు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన, మహిళా సాధికా రత తదితర అంశాలపై అవ గాహన కల్పించారు.ఈ స మావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రచార యాత్ర రైడర్లు పరాస్, అమి త్ త్యాగి, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తది తరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

మొదటిపేజీ తరువాయి..

సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం,పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి..

చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా



ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్--మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967